ప్రజాశక్తి

శనివారం 10 జూన్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

బాటసారులకు నీడ కరువు

షెల్టర్లులేక ప్రయాణికులకు తప్పని తిప్పలు - గుంటూరులో ఎండమావిగా ఆహ్లాదం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పల్నాడు బస్టాండ్‌లో ప్రయాణికులు

గుంటూరులో మొక్కల పంపిణీ నిలిచింది. సామాజిక అటవీశాఖ గుంటూరు డివిజన్ కార్యాలయం ఎత్తివేయడంతో మొక్కల పంపిణీ బాధ్యత ఎవరికి అప్పగిస్తారన్నదీ ప్రశ్నార్థకంగా మారింది. గుంటూరు కార్పొరేషన్‌లో ఏటా లక్ష మొక్కలు నాటుతున్న చెబుతున్నా 10 శాతం మొక్కలకు పరిరక్షణ జరగడం లేదు. నగరంలో ప్రధాన వీధుల్లో ఎక్కడ ఒక భారీ వృక్షం కూడా లేదు. ఎండతీవ్రత తట్టుకోలేక ప్రజలు చెట్లకింద చేరేందుకు అనువైన పరిస్థితులు లేవు. ప్రధాన రహదారుల్లో భారీ వృక్షాలను తొలగించడం, వాటి స్థానంలో మొక్కలు నాటకపోవడం, నాటినా వాటిని సంరక్షించకపోవడంతో గుంటూరులో ఆహ్లాదం ఎండమావిగా మారింది.

గ్రామీణ ప్రాంతాల నుంచి గుంటూరు వచ్చిన వారికి కనీస నిలువనీడ కరువైంది. బస్ షెల్టర్లు లేవు. షెల్టర్ల వద్ద బస్సులు ఆగవు. పల్నాడు బస్టాండ్ వద్ద నిత్యం వందలాది బస్సులు వచ్చి వెళ్తుంటాయి. 50 వేల మంది ప్రయాణికులు ఈమార్గంలో ప్రయాణిస్తుంటారు. గుంటూరు-మాచర్ల, గుంటూరు-ఒంగోలు, గుంటూరు-పర్చూరు మార్గంలో వెళ్లే బస్సులన్నీ పల్నాడు బస్టాండ్‌కు వచ్చి వెళ్తుంటాయి. ఇక్కడ ప్రయాణికులు రోడ్డుపై నిలబడి బస్సులు ఎక్కి వెళ్లాల్సిందే. ఎంత ఎండవున్నా కనీసనీడ దొరకదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

▸ 2లో

మాట్లాడుతున్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని

గర్భిణులకు ఆరోగ్యశ్రీలో ఉచిత స్కానింగ్

వేదాంత ఆస్పత్రిలో ప్రారంభించిన వైద్యారోగ్య శాఖ మంత్రి రజని

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఆరోగ్యశ్రీ పథకంలో నూతనంగా చేర్చిన ఆల్ట్రాసౌండ్, టిఫా స్కానింగ్‌లను గర్భిణులకు ఉచితంగా చేస్తున్నట్టు వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజని తెలిపారు. అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఈ సదుపాయం ఉంటుందన్నారు. గుంటూరు వేదాంత ఆసుపత్రిలో పరికరాలను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఆల్ట్రాసౌండ్, టిఫా స్కాన్స్ ప్రతి గర్భిణీకి ఉపయోగపడుతుందని, ప్రైవేటుగా

▸ 2లో

బడికి బదులు పనిలో..

అధికారుల తనిఖీల్లో 8 మంది బాలకార్మికుల గుర్తింపు

2 లో

అమిత్‌షా రాష్ట్ర పర్యటనకు వ్యతిరేకంగా రేపు నిరసనలు

8 లో

సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు పాశం రామారావు, జంగాల అజయ్‌కుమార్ పిలుపు

నరసరావుపేటలో జాతా

కౌల్దార్లకు కార్డు కోసం చట్టాన్ని సవరించాలి

- కౌలురైతు సంఘం రాష్ట్ర జాతా డిమాండ్
- పల్నాడు, గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటన

4 లో

5 లో

అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మతోన్మాద బిజెపిపై అమరుల స్ఫూర్తితో పోరాటం

- సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు
- పాలపర్రు అమరవీరులకు ఘన నివాళి

దాచేపల్లి మండలం ఇరికేపల్లిలోని ప్రాథమిక పాఠశాలకు నాడునేడు రెండో దశలో భాగంగా రూ.16 లక్షలు మంజూరు చేశారు. రెండు అదనపు తరగతి గదులు, నాలుగు మరుగుదొడ్లు, ప్రహరీ, నీటి సంపు ఏర్పాటు చేయాల్సి ఉంది. తరగతి గదులకు స్లాబు వేయగా. మరుగుదొడ్ల నిర్మాణం గోడలకే పరిమితమైంది. ఇప్పటి వరకు రూ.10 లక్షలు ఖర్చవగా ప్రహరీ, సంపు పనులింకా మొదలవ్వలేదు.

ఇరికేపల్లి పాఠశాలలో మొండి గోడలకే పరిమితమైన మరుగుదొడ్లు

పిడుగురాళ్లలోని మన్నెం పుల్లారెడ్డి జెడ్‌పి పాఠశాల విద్యార్థుల సంఖ్యపరంగా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. ఈ పాఠశాలలో గతేడాది 2170 మంది విద్యార్థులుండగా ఈ ఏడాది మరో 350 మంది పెరుగుతారని అంచనా. ఈ పాఠశాలలో ఇప్పటికే 30 తరగతి గదులుండగా మరో 20 గదుల నిర్మాణం కోసం రూ.2.40 కోట్లు కేటాయించారు. 14 గదుల నిర్మాణం చేపట్టగా 9 గదులకు ప్లాస్టింగ్ పూర్తయింది. ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలు, విద్యుత్ తదితర 40 శాతం పనులు పూర్తి కాలేదు.

బడుల్లో అసంపూర్తిగా పనులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పల్నాడు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేపట్టిన నాడు-నేడు పనులు నత్తనడకన సాగుతున్నాయి. పాఠశాలలు పున:ప్రారంభమయ్యే నాటికి పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ పలుమార్లు సమీక్షలు చేసినా క్షేత్రస్థాయిలో పనులు మాత్రం ఆశించినంత వేగంగా జరగలేదు. రెండ్రోజుల్లో విద్యా సంస్థలు పున: ప్రారంభం కానున్నా 30 శాతం వరకు పనులు పూర్తవ్వలేదు. పలు పాఠశాలల్లో అరకొర నిర్మాణాలు, ఉపయోగించని నిర్మాణ సామగ్రి దర్శనమిస్తున్నాయి.

పల్నాడు జిల్లాలో మొదటి దశ పనుల కింద 623 పాఠశాలలకు రూ.156 కోట్లు కేటాయించి పనులు చేపట్టారు. కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తవకపోవడంతో వాటిని రెండో దశ పనుల్లో కలిపి కొనసాగించారు. 908 పాఠశాలలలో పనుల కోసం రూ.307 కోట్లను రెండో దశ కింద కేటాయించారు. వీటిల్లో 9 కాలేజీలు, 113 ప్రైమరీ అంగన్‌వాడీ పాఠశాలలు, 609 ప్రాథమిక పాఠశాలలు, 103 ప్రాథమికోన్నత పాఠశాలలు,174 జెడ్‌పి పాఠశాలలు, మరో 13 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మొదటి దశలో ఆయా పాఠశాలల్లోని ప్రధాన, చిన్నచిన్న మరమ్మతులు పూర్తి చేశారు. మరుగుదొడ్లు, ఫ్యాన్లు, లైట్లు, వంట గదుల నిర్మాణం, ఇంగ్లీష్ ల్యాబులు, తాగునీటి వసతి తదితర ఏర్పాట్లు చేశారు. రెండో దశలో అదనపు తరగతి గదుల నిర్మాణంతోపాటు మొదటి దశలో మిగిలిన పనుల పూర్తి వంటివి చేపట్టారు.

▸ 2లో

- 30 శాతం వరకూ నాడు-నేడు పెండింగ్
- శాఖల మధ్య కొరవడిన సమన్వయం?
- సమయానికి అందని సామగ్రి
- మరో రెండ్రోజుల్లో పాఠశాలల పున:ప్రారంభం

పిడుగురాళ్లలో అంపూర్తిగా తరగతి గదులు

బడికి బదులు పనిలో..

అధికారుల తనిఖీల్లో 8 మంది బాలకార్మికుల గుర్తింపు

ప్రజాశక్తి - మాచర్ల

బాల కార్మికుల నిర్మూలనలో భాగంగా పట్టణంలో గురు, శుక్రవారాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఇటుక బట్టిలతో పాటు, పలు దుకాణాల్లో పని చేస్తున్న 14 ఏళ్లలోపు పిల్లలు ఎనిమిది మందిని గుర్తించి ఆయా దుకాణాలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ అధికారులు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందర్నీ బడులకు పంపాల్సిందేనని స్పష్టం చేశారు. 14 ఏళ్లలోపు పిల్లలను పనులకు పెట్టుకుంటే యాజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బడికి వెళ్లాల్సిన పిల్లల్ని పనులకు పంపొద్దని తల్లిదండ్రులకు సూచించారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ధనలక్ష్మీ, మాచర్ల లేబర్ ఆఫీసర్ విష్ణు, ఎస్ఐ అల్లూరిరెడ్డి పాల్గొన్నారు.

బడుల్లో అసంపూర్తిగా పనులు

(మొదటి పేజీ తరువాయి)

అయితే వీటన్నింటిలోనూ ప్రస్తుతం 30 శాతం వరకూ పనులు పూర్తవ్వలేదు. తరగతులు ప్రారంభమైతే వాటిని కొనసాగించడమూ కష్టమవుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

పనుల ఆలస్యానికి ఇంజినీరింగ్, పేరెంట్స్ కమిటీ, ఇతర శాఖల మధ్య సమన్వయ లోపం ఒక కారణం కాగా ఇసుక, సిమెంట్, ఇనుము, కంకర తదితర నిర్మాణ సామగ్రి సరైన సమయానికి రాకపోవడం ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఫర్నీచర్, విద్యుత్ తదితర పరికరాలూ సమయానికి రావడం లేదని చెబుతున్నారు. మరోవైపు కొత్త పనులు మొదలు పెట్టకుండా మొదలుపెట్టిన వాటిని త్వరగా పూర్తిచేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నట్లు సమాచారం. అయినా ఇప్పటికే ఆలస్యమైందని, పనులు ఇంతకు మించి ఇప్పటికిప్పుడు పూర్తి కావని కిందిస్థాయి అధికారులు చెబుతున్నారు. పనులు అసంపూర్తిగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ప్యానల్ ద్వారా విద్యార్థులకు బోధిస్తామని, అందుకుగాను 1340 ఇంటర్‌యాక్టివ్ ఫ్యానల్స్‌ను పాఠశాలలకు అందించామని, 420 స్మార్ట్ టీవీలు. గ్రీన్ చాక్ బోర్డులనూ ఏర్పాటు చేయబోతున్నామని అధికారులు తెలిపారు.

నేరాల నియంత్రణపై ఎస్పీ సమీక్ష

ప్రజాశక్తి - నరసరావుపేట

'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులను నిర్దిష్ట సమయంలోగా చర్యలు చేపట్టి, పోర్టల్ లో డాక్యుమెంట్లను అప్లోడ్ చేయాలని, పోక్సో కేసులు, మహిళల పై జరిగే నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ప్రాపర్టీ కేసులు, మిస్సింగ్ కేసులు మొదలైన కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలని నేరాలు అరికట్టే విధంగా ప్రతి ఒక్కరూ కషి చేయాలని పోలీస్ అధికారులకు పల్నాడు ఎస్పీ వై.రవి శంకర్ రెడ్డి ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. స్పందన పిటిషన్లు,పొక్సో కేసులు, గ్రేవ్ కేసులు, ప్రాపర్టీ కేసులు, చీటింగ్ కేసులు, 174 కేసులు, మిస్సింగ్ కేసులు, , గంజాయి, నాటుసారా ల కట్టడికి తీసుకోవలసిన చర్యల గురించి సమీక్షించారు. దిశ కాల్స్, 112, 100 ఎమర్జెన్సీ నెంబర్ల నుండి వచ్చు కాల్స్ కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వాటి పట్ల నిర్లక్ష్యం వహించకుండా వెనువెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. కాల్ వచ్చిన సమయం మరియు సంఘటన స్థలానికి చేరుకున్న సమయాన్ని పరిగణలోకి తీసుకొని నిర్లక్ష్యంగా స్పందించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులను హేతు బద్ధంగా విశ్లేషించి పరిష్కరించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లను ఆశ్రయించే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, సున్నితమైన భాషతో మాట్లాడాలని, వారితో మమేకమై సమస్యలను ఓపికగా విని, ఫలితంగా బాధితులకు న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగించాలని సూచించారు. మహిళలు, బాలికలు, చిన్నారుల పిర్యాదులు అందిన వెంటనే ప్రతిస్పందించి తగు చర్యలు తీసుకోవాలని, వారికి సంబంధించిన కేసుల విచారణ సమయంలో తప్పనిసరిగా మహిళా పోలీస్ అధికారి గాని, సిబ్బంది గాని ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో పరిమితికి మించి ఎక్కువ మందితో వెళుతున్న వాహనాలు ప్రమాదాలకు గురి అవుతున్నాయన్నారు. రోజూ వారి కూలీలు ఎక్కువగా ఆటో లలో, ట్రాక్టర్ లలో, ఇతర వాహనాలలో సామర్థ్యానికి మించి ఎక్కి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారన్నారు. ఏదైనా అనుకోని విధంగా ప్రమాదం జరిగితే ప్రమాదతీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. కనుక వాటిని కంట్రోల్ చేయడానికి మొదటిగా ట్రాక్టర్, ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. అప్పటికి వారి ప్రవర్తనలో మార్పు రాకుంటే చలానాలు విధించాలని, అవసరమైతే వాహనాన్ని సీజ్ చెయ్యాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, క్రయ విక్రయాల పై కఠినంగా వ్యవహరించాలన్నారు. గతంలో పల్నాడు జిల్లాలో సత్తెనపల్లి రూరల్ సర్కిల్ లో, నరసరావుపేట 2వ పట్టణ, అమరావతి పోలీస్ స్టేషన్లలో సీఐలుగా పనిచేసి ఉత్తమ ప్రతిభ కనబరిచి బదిలీ పై వెళ్లిన సిఐలు ఉమేష్, వెంకటరావు, శివ ప్రసాద్ అభినందించి సన్మానించారు.

సమావేశంలో ఏఆర్ అదనపు ఎస్పి డి రామచంద్రరాజు, క్రైమ్ అదనపు ఎస్పి ఎస్.కె. చంద్రశేఖర్, డీఎస్పీలు కె.వి మహేష్, బి. ఆదినారాయణ, పల్లపు రాజు, ఎస్.కె షర్ఫొద్దీన్, యు.రవిచంద్ర, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం

ప్రజాశక్తి-పెదకూరపాడు : నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గర్భిణిలకు శుక్రవారం పౌష్టికాహారం అంద జేశారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఓ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాగులూరి ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి హరిబాబు, మాగులూరి కృష్ణారావు, కొండవీటి ప్రసాదు, డాక్టర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఎంపిడిఒగా టి.వీరభద్రాచారి

ప్రజాశక్తి-నూజెండ్ల : మండల నూతన ఎంపీడీవో గా టి వీరభద్రాచారి శుక్ర వారం బాధ్యతలు స్వీకరించారు గతంలో ప్రకాశం జిల్లా అర్ధ వీడు మండల ఈవోపీఆర్డి గా విధులు నిర్వర్తిస్తూ ప్రమో షన్‌లో భాగంగా మండల ఎంపిడిఒగా నియమితు లయ్యారు. గతంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా పనిచేసిన షేక్ జిలాని బాషా బదిలీపై వెళ్లారు. వీరభద్రాచారి మీడియాతో మాట్లాడుతూ అధికారులందరినీ సమన్వయపరిచి, మం డలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

'మినీ మేనిఫెస్టోతో వైసిపి నేతలకు చమటలు'

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

భవిష్యత్తుకు గ్యారెంటీ మ్యానిఫెస్టోపై టిడిపి జిల్లా కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశానికి టిడిపి తూర్పు నియోజకవర్గం ఇన్‌ఛార్జి నశీర్ అహ్మద్ అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలను కోరారు. ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించేలా, ఆర్థికంగా పేదలను సుసంపన్నులను చేసేలా అన్ని వర్గాలకు భరోసా కల్పిస్తూ, ఆచరణాత్మకమైన పథకాలను తెలుగుదేశం పార్టీ ప్రకటించిందన్నారు. సంక్షేమం,అభివద్ధి, సామాజిక న్యాయం అనే పునాదులపై ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ ప్రజల భవిష్యత్తును దష్టిలో పెట్టుకుని రానున్న ఎన్నికల్లో అధికారంలోకి వచ్చాక అమలు చేసే పథకాల పై 'భవిష్యత్ కు గ్యారంటీ' పేరుతో నారా చంద్రబాబు నాయుడు ప్రణాళిక రూపొందించారని తెలిపారు. ట్రైలర్ మ్యానిఫెస్టోకే సిఎం జగన్‌కు చెమటలు పడుతున్నాయని, అసలు సినిమా జగన్ కి ముందుందని అన్నారు. ప్రజల సంక్షేమం, అభివద్ధి టీడీపీ పాలనతోనే సాధ్యమన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కషి చేసి వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిని చేయాలని ఈ సందర్భంగా కోరారు. టిడిపి నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, టిడిపి నాయకులు దాసరి రాజా మాస్టారు, చిట్టాబత్తిన చిట్టిబాబు పాల్గొన్నారు.

మలేరియా మాసోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-తెనాలి

మలేరియా మాసోత్సవాల్లో భాగంగా పట్టణానికి చెందిన మలేరియా, ఫైలేరియా విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.'ఫ్రైడే డ్రైడే'గా పాటించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గంగానమ్మపేట అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ వి.మౌనిక కుమార్ మాట్లాడుతూ మలేరియా, డెంగీ, బోదకాలు వంట వ్యాధులు దోమల ద్వారా వృద్ధి చెందుతాయని, దోమల నివారణకు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని ,విధిగా దోమతెరలు వాడాలని చెప్పారు. ఎవరైనా జ్వరపీడితులుగా ఉంటే వెంటేనే సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. ర్యాలీని ఉద్దేశించి ఇన్‌ఛార్జి మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి, ఫైలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.ఉమాకాంత్ మాట్లాడారు. పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో ప్రజలకు దోమల నియంత్రణపై కరపత్రాలు పంచారు. కె.శ్రీవాణి, కె.నాగలక్ష్మి, ఎ.శివకృష్ణ పాల్గొన్నారు.

బాటసారులకు నీడ కరువు

(మొదటి పేజీ తరువాయి)

గుంటూరు-విజయవాడ మార్గంలో జాతీయ రహదారికి అనుబంధంగా ఉన్న సర్వీసు రోడ్లులలోకూడానీడ కరువైంది. వివిధ ప్రాంతాల నుంచి మార్కెట్ సెంటర్‌కు వచ్చే బస్సుల నుంచి దిగిన ప్రయాణికులు దుకాణాల ముందు ఉండే నీడన చేరాల్సివస్తుంది.

లాడ్జి సెంటర్, అమరావతి రోడ్డు, గుంటూరు-తెనాలి మార్గం, గుంటూరు-పేరేచర్ల, గుంటూరు -పలకలూరు, గుంటూరు-గోరంట్ల మార్గాల్లో ఒక్క భారీ చెట్టు లేకుండా రహదారుల విస్తరణలో తొలగించారు. మళ్లీ కొత్త మొక్కలను చెట్లుగా మార్చిన ధాఖలాలు లేవు. గుంటూరులో డివైడర్లపై నీడనివ్వని మొక్కలునాటి కార్పొరేషన్ అధికారులు చేతులు దులుపుకొంటున్నారు. గుంటూరు నుంచి విజయవాడ వెళ్లేందుకు ఆర్‌టిసి బస్టాండు ఎదుట ప్రయాణికులు రోడ్డుపై ఎండలో నిలబడి బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. ఇదేపరిస్థితి బి.ఆర్ స్టేడియం వద్దకూడా ఎదురవుతోంది. గుంటూరు - బాపట్ల - చీరాల, రేపల్లె, పొన్నూరు, తెనాలి వెళ్లే ప్రయాణికులు కూడా సరైన షెల్టరు లేక ఇబ్బంది పడుతున్నారు.

సామాజిక అటవీశాఖ ఆద్వర్యంలో పేరేచర్లలో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన నగరవనం జనాదరణకు నోచుకోవడం లేదు. దీని నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పర్యాటకులు లేక కళావిహీనంగా మారింది. 63.31 హెక్టార్ల విస్తీరణంలో నిర్మించిన నగర వనం అభివృద్ధికి నోచుకోక వెలవెలబోతోంది. పేరేచర్లలో 2017వ సంవత్సరం నవంబర్ 4వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన నగర వనాన్ని నాలుగేళ్లుగా అభివృద్ధి చేయడం లేదు.

గర్భిణులకు ఆరోగ్యశ్రీలో ఉచిత స్కానింగ్

(మొదటి పేజీ తరువాయి)

చేయించుకునే ఈ పరీక్షలు ఇక రూపాయి ఖర్చు లేకుండా చేయించుకొచ్చునని అన్నారు. టిడిపి హయాంలో 1059 రోగాలే ఆరోగ్యశ్రీ జాబితాలో ఉండగా వైసిపి ప్రభుత్వం 3257 చికిత్సలను చేర్చినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా 2022-23లో రూ.3,400 కోట్ల పైగా ఖర్చు చేశామని, 2.32 లక్షల కాన్పులు ఉచితంగా చేశామని తెలిపారు. కేవలం గర్భిణులకు చికిత్స అందించేందుకే రూ.247 కోట్లు వెచ్చించామన్నారు. నాడు-నేడు కింద గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు రూ.500 కోట్లు కేటాయించగా ఇప్పటికే రూ.40 కోట్ల పనులు పూర్తయినట్లు తెలిపారు. ఎంసిహెచ్ బ్లాక్ నిర్మాణం శరవేగంగా జరుగుతోందని, త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో తొలిసారిగా ఇన్ పేషంట్‌గా లేకున్న అవుట్ పేషంట్లకు స్కాన్ చేయించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రసవం జరిగిన వెంటనే రూ.5 వేలను బాలింతల ఖాతాలకు జమ చేయడంతోపాటు ఐసిడిఎస్ ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ కిట్‌ల పౌష్టికాహారం, చిన్నారులకు బాలమృతం అందిస్తున్నారన్నారు. వీటికి అయ్యే ఖర్చులో కేంద్ర ప్రభుత్వం 25 శాతం మాత్రమే అందిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం 75 శాతం భరిస్తోందని చెప్పారు. సిహెచ్‌సి, పిహెచ్‌సిల నుంచి హైరిస్క్ గర్భిణులను జిల్లా ఆసుపత్రులకు ఉచితంగా తరలించేందుకు అయ్యే రవాణా ఖర్చుల కోసం నిధులను విడుదల చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా అల్ట్రాసౌండ్, టిఫా స్కాన్ గర్భిణులకు ఉచితంగా అందించే కార్యక్రమానికి సంబంధించి ప్రచార పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ సిఇఒ హరింధర ప్రసాద్, ఎమ్మెల్యేలు ముస్తఫా, గిరిధర్, జిడిసిసి బ్యాంకు చైర్మన్ ఆర్.సీతారామంజనేయులు, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయరు సజీలా పాల్గొన్నారు.

మద్యం మత్తులో హత్య

స్నేహితుల మధ్య ఘర్షణ నేపథ్యంలో ఘటన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మద్యం మత్తులో స్నేహితుడ్ని హత్య చేసిన ఘటన స్థానిక చినపలకలూరులో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం అరండల్ పేటకు చెందిన పగడాల వెంకటేష్, రమేష్ ,పలకలూరుకు చెందిన కార్తీక్, మునాఫ్ నలుగురు పనులు చేసుకుంటూ జీవిస్తూంటారు. శుక్రవారం మధ్యాహ్నం నలుగురు కలిసి మందు తాగుదామని, చిన్న పలకలూరు ఊరు బయటకు వెళ్లారు. మద్యం తాగుతుండగా స్వల్ప వివాదం ఏర్పడింది. వెంకటేష్ అనే యువకుడు రమేష్‌ను గతంలో తనకు ఇవ్వాల్సిన డబ్బు గురించి అడగ్గా మాటమాట పెరిగింది. వెంకటేష్, రమేష్ ని బూతులు తిట్టగా అందుకు వెంకటేష్ తన వద్ద గల బీరు సీసాతో రమేష్ కాలు మీద పొడవుగా రమేష్ బీరు బాటిల్‌తో వెంకటేష్ తలపై కొట్టాడు. దీంతో ఘర్షణ తీవ్ర రూపం దాల్చింది. వెంకటేష్‌ను మిగతా ముగ్గురు కలిసి కొట్టి సీసాతో పొడిచారు. వెంకటేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. సౌత్ డిఎస్‌పి మహబూబ్ భాషా, నల్లపాడు సిఐ బత్తుల శ్రీనివాసరావు ఘటన స్థలాన్ని సందర్శించారు. కేసు సిఐ బత్తుల శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు. హతుడు, హంతుకులపై గతంలోరౌడీషీట్‌లు ఉన్నాయని తెలిసింది.

వివాహిత దారుణ హత్య

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక నల్లచెరువులో శుక్రవారం ఒక వివాహిత హత్యకు గురయింది. లాలాపేట పోలీసుల కథనం ప్రకారం హతురాలు నేనావాత్ భారతి బాయి (43) స్వస్థలం కర్నూలు జిల్లా ఆత్మకూరు కాగా 20 ఏళ్ల క్రితం భర్తతో విడిపోయింది. ప్రస్తుతం గుంటూరు లోని నల్లచెరువులో తన చిన్న కుమార్తుతో ఉంటోంది. ఆమెకు ముగ్గురు పిల్లలు ఉండగా వీరిలో ఇద్దరికి వివాహం చేసింది. గతంలో దాసరిపాలెం గ్రామంలో నివాసం ఉన్న ఆమె 5 నెలల క్రితం గుంటూరు కు వచ్చి నల్లచెరువు 3వ లైనులో అద్దె ఇంట్లో తన చిన్న కుమారుడితో కలసి ఉంటోంది. ప్రస్తుతం ఆమె చుట్టుగుంట వద్ద గల నైస్ టీ షాప్‌లో పనిచేస్తుంది. కొంతకాలం క్రితం ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తితో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. కొన్ని రోజుల తరువాత ఇద్దరి మధ్య ఘర్షణ ప్రారంభం అయింది. ఈనేపథ్యంలో శుక్రవారం ఆమెను ప్రతాప్ రెడ్డి మారణాయుధాలతో కొట్టి హత్య చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఉదయం పనికి వెళ్లిన చిన్న కుమారుడు సాయంత్రం వచ్చి చూడగా రక్తపు మడుగులో పడిఉన్న తల్లిని చూసి ఘొల్లుమన్నాడు. తూర్పు అదనపు ఎస్‌పి విశ్వనాథ్,లాలాపేట సిఐ సుబ్బారావు తమ సిబ్బంది తో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. హత్య చేసిన వ్యక్తి గురించి ఆరా తీస్తున్నారు. కేసును సిఐ సుబ్బారావు దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సీడ్ టు సీడ్ కిట్స్ పంపిణీకి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు : జిల్లాలో ప్రకృతి వ్యవసాయ చేస్తున్న ఎస్సీ రైతులందరు ప్రధాన మంత్రి అనుచిత జాతి అభ్యుదయ యోజన పథకం ద్వారా సీడ్ టు సీడ్ కిట్స్, ఇతర పరికరాలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలక్టరేట్‌లో పీయంఏజేఏవై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సీడ్ టు సీడ్ కిట్స్ అందించడానికి గుర్తించిన 615 మంది ఎస్సీ రైతుల వివరాలను మండలాల వారీగా అందించాలన్నారు. వీరందరికీ కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పట్టాదారు పాసు పుస్తకాలు లేదా సీసీఆర్‌సి కార్డులు వ్యవసాయ, రెవెన్యూ అధికారుల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పథకానికి మరింత మంది అర్హులను గుర్తించేందుకు వ్యవసాయ శాఖాధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లా షెడ్యూల్ కులముల సేవా సహకార సంఘం అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా షెడ్యూల్ కులముల సేవా సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకులు టి.ప్రేమకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు, ఏపీసీఎన్ఎఫ్ డిపిఓ రాజకుమారి, ఏపీసీడ్స్ డియం జి. సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై మూడు కేసులు నమోదు

ప్రజాశక్తి-తెనాలి

వేధింపులపై శుక్రవారం ఒక్క రోజే పట్టణ ఒన్ టౌన్ పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం పట్టణంలోని నాజరుపేటకు చెందిన రాగం జయశ్రీని తన భర్త కోటేశ్వరరావు వేదింపులకు గురిచేస్తున్నట్లు పోలీసులకు పిర్యాదు చేసింది. అలాగే స్థానిక షరాఫ్ బజారుకు చెందిన ముసునూరి శైలజను ఆమె భర్త శివకుమార్ వేదింపులకు గురిచేస్తున్నాడని, రామలింగేశ్వరపేటకు చెందిన నాగలక్ష్మిశైలజను ఆమె భర్త రాంచరణ్ వేదిస్తున్నట్లు పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ మూడు పిర్యాదులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆసుపత్రి నుంచి రోగి అదృశ్యం

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక జిల్లా వైద్యశాల నుంచి రోగి అదృశ్యమైన ఘటనపై త్రీటౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని నాజరుపేటకు చెందిన వల్లభాపురపు మాధవ కృష్ణ గతనెల 27న ఎలుకల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడి నుంచి గురువారం తెనాలి జిల్లా వైద్యశాలలో చేర్పించారు. ఈ నేపద్యంలో ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరిన మాధవకృష్ణ శుక్రవారం కనిపించకుండా పోయాడు. దీనిపై కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S NO: 84/2015

భీమనాదం విజయలక్ష్మి వగైరాలు ...... వాదులు

అండ్

భీమనాదం రాఘవరెడ్డి డైడ్ వగైరాలు ...ప్రతివాదులు

నోటీస్

To

R14 నలమలపు శివపార్వతి, భర్త చంద్రశేఖర రెడ్డి, సంగటిగుంట రెడ్ల బజార్, గుంటూరు.

I. A 108/2020, I. A 109/2020, I. A 110/2020 వాదులు పై నెంబర్ల పిటిషన్ దాఖలు చేయుట ద్వారా నిన్న చనిపోయిన మా తండ్రి భీమనాదంరాఘవరెడ్డి గారికి వారసురాలిగా చేర్చమని మరియు అందుకు గాను జరిగిన ఆలస్యమును క్షమింపమని, మరియు భీమనాభం రాఘవ రెడ్డి గారికి పై ఉన్న అబెట్మెంట్ ఉత్తర్వులు రద్దు చేయమని కోరుచున్నారు. పై పిటిషన్ల పై మీకేమైనా అభ్యంతరములు ఉన్నచో అట్టివి 23-6-2023 వ తేదిన పై కోర్టు ఎదుట ఉదయం 10.30 గం.హాజరై తెలుపుకొనగలవు. లేనిచో పై పిటిషన్లు మీ పరోక్షమందు తీర్మానంకాగలవు.

అద్దంకి ఇట్లు

తేది: 09-06-23 **వెలగపూడి సుబ్రహ్మణ్యం**

వాదుల తరపు అద్వకేట్

వైసిపి అరాచక పాలనకు చరమగీతం : వర్ల

ప్రజాశక్తి- సత్తెనపల్లి టౌన్

వైసీపీ పాలనకు చమర గీతం పాడే సమయం ఆసన్నమైందని దానికి టిడిపి కార్యకర్తలు నాయకులు సిద్ధంగా ఉండాలని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వల్లరామయ్య అన్నారు . శుక్రవారం అయిన స్థానిక వెంకటేశ్వర గ్రాండ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఎల్లేడి రామస్వామి అధ్యక్షతన సభలో వర్ల మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తన తండ్రి పదవిని అడ్డుపెట్టుకొని వైయస్ జగన్ లక్ష కోట్లు అక్రమంగా సంపాదించాడని ఆరోపణ చేశారు . ఈ నేపద్యంలోనే వైయస్ జగన్ పై కేసులు నమోదు చేసి 16 నెలపాటు జైల్లో ఉన్న ఘనత నేటి ముఖ్యమంత్రి వైయస్ జగన్‌కి దక్కింది అంటూ చలోక్తులు విసిరారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ఈ నాలుగేళ్ల కాలంలో రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమీ లేదంటూ ఆయన మాత్రం లక్షల కోట్లు సంపాదించారంటూ విమర్శించారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్ అనేక సందర్భాలలో మాట్లాడుతూ ఈ ఎన్నికలు పేదవారికి దళిత వర్గానికి జరుపుతున్న పోరుగా అభివర్ణించడానికి తాను ఒప్పుకుంటున్నానని అంటూనే వైసీపీ పార్టీ ధనిక వర్గాలకు అండగా ఉంటే పేదలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుంది అంటూ చమత్కరించారు. సీనియర్ నాయకులు మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తనను ప్రతి కార్యకర్త ఆశీర్వదించాలన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో అంబటి రాంబాబు పోటీ చేస్తానని ధైర్యంగా గుండె చేసుకొని చెప్పగలడా అంటూ చాలెంజ్ విసిరారు . ముందుగా స్వర్గీయ నందమూరి తారకరామారావు డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు జయప్రకాష్ నారాయణ పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షులు జీవీకే ఆంజనేయులు రాష్ట్ర నాయకులు చౌటా శ్రీనివాసరావు భీమినేని వందనాదేవి , మన్నెం మల్లిఖార్జునరావు .నాగోతు సౌరయ్య , మైనార్టీ సెల్ నాయకులుఅల్లబక్షు తదితరులు పాల్గొన్నారు.

భూమి సేల్ డీడ్ డాక్యుమెంట్ పోయినది

పల్నాడుజిల్లా, అమరావతి మండలం, అత్తలూరు గ్రామానికి చెందిన అమరనేని పెంచలయ్య నా యొక్క భూమి సేల్ డీడ్ డాక్యుమెంట్ రామాపురం గ్రామ నెం. 549/2000 సర్వే నెం.93-1 య.1.00 సెంట్లు, అత్తలూరు గ్రామ సేల్ డీడ్ 1090/2006 సర్వే నెం. 376-ఎ-1సి ఎ.0.69 సెంట్లు, పార్టీషను డాక్యుమెంటు నెం. 750/2009 సర్వే నెం. 378-ఎ, 376-ఎ1సి, 383-సి 378-బి1, 376-బి1ఎ, 376-బి1సి వెరసి య.2.37 సెంట్లకు సంబంధించిన డాక్యుమెంట్లు నేను 10-05-2023 న అత్తలూరు నుండి అమరావతి జిరాక్స్ కాపీల కోసం వస్తుండగా ఎక్కడో జారిపడిపోయినవి. నేను తిరిగి వెనక్కివెళ్ళి వెతకగా కనిపించలేదు. ఆ ప్రాంతంలో అందరినీ అడిగాను. వాటి ఆచూకీ తెలియలేదు. డాక్యుమెంట్లు దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అమరనేని పెంచలయ్య,
అత్తలూరు గ్రామం,
అమరావతి మండలం, పల్నాడుజిల్లా.

GENERAL NOTICE
IN THE COURT OF THE HON'BLE
PRL.SENIOR CIVIL JUDGE::GUNTUR
S.O.P NO.39/2023

Between:
1)Karthik Savisetty, S/o.Veera Mallaiah,
2) Nandana Savisetty,D/o.KarthikSavisetty,
3)Hanvikka Savisetty,D/o.Karthik Savisetty,
2 & 3 are miniors rep.by his father/guardian P-1,Karthik Savisetty, all are R/o.Door No:2-14-159/10E,9 th line, Syamala Nagar, Guntur City ….Petitioners

And

1)V.M.Ware software India Pvt.Ltd, #165/1, 165/17, Kalyani Vista, Kalyani magnum, IT park, Doraisamiralya, bileka-halli, J.P.Nagar, 4 th phase, Bangalore, Karnataka-560076, 2) E Trade securities LLC,Harborside2,200 Hudson Street, suite501,Jersey city, NJ073114, USA …Respondents

పై నెంబరు ఎస్.ఓ.పి.లో 1నుండి 3 పిటీషనర్ల పేరుతో, ఒకటి నుండి రెస్పాండెంట్స్ వద్ద ఉన్న శేర్లు అమౌంట్ $ 94862.34 డాలర్లకు Succession సర్టిఫికెట్ ఇప్పించమని కోరుతూ పై నెంబరు S.O.P. దాఖలు చేయగా శ్రీ కోర్టు వారు సదరు పిటిషన్‌పై ఎవరికైన అభ్యంతరములు ఉంటే తెలుపుకొన వలసినదిగా కోరుతూ జనరల్ నోటీస్ నిమిత్తము ది:30-06-2023కు వాయిదా వేసినారు. కావున ఆక్షేపణలు ఉన్నవారు వాయిదా రోజు ఉ.గం. 10:30ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై వారికి గల అభ్యంతరాలను తెలుపు కొనవలెను. లేనియెడల శ్రీకోర్టువారిచే చట్ట ప్రకారం తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:30-06-2023

M.Subba Rao,
Advocate for Petitioners,
Guntur.

పబ్లిక్ నోటీసు

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్

(ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ యొక్క అనుబంధ సంస్థ) రి.నెం. ABC-CS/006/2015,
H.O. ABCCS, Endowments Commissionersate Campus, Gollapudi, Vijayawada, Krishna (D), A.P - 521 225, Ph : 0866-6650307
B.O : ABCCS, ABCCS, C/o yadavalli Vari Satram, Beside Modern Theatre, Kothapeta, Guntur, Guntur (D), A.P-522201 Ph : 0863-2958557

ఈ ప్రకటనలోని వారి తాలూకా ఈ దిగువ ఉదహరించిన స్థిరాస్తి పై సొసైటీ నందు తనఖా పెట్టి, సొసైటీ నుంచి అప్పు పొందుటకు దరఖాస్తు చేసియున్నారు. సదరు తనఖాపై సొసైటీవారు మంజూరు చేయబోవు అప్పు విషయమై ఎవరికైననూ ఎట్టి అభ్యంతరములు వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 7 రోజుల లోపుగా లిఖిత పూర్వకంగా వారి అభ్యంతరములను రిజిష్టరు పోస్టు విత్ ఎక్నాలెడ్జిమెంట్ ద్వారా బ్యాంకుకు తెలియపర్చవలసినదిగా కోరుతున్నాము.

వ.నెం.	పేరు	స్థిరాస్తి వివరములు
1.	Mr. Potturi Venkata Raghu Kumar, S/o Potturi Jaganmohan Rao, GL : 81610 Mobile No. 9849897122 M/s. Potturi Venkata Ramdevi W/o Potturi Venkata Raghu Kumar App No. 71055 Mobile No. 9014036030	The Property an extent of undivided and unspecified share of 25.22 Sq. yards out of 832 sq.yards of site along with Apartment Complex by name and style of "PALLAVI SUDHA HOMES", A Block, Flat No. 503, 4th Floor, situated at Demarcation No. 751, Plot No.s 108 to 112, near to Vinayaka Temple, NH-16, Assessment No. 1021147491, Revenue Ward No. 55, Ankireddypalem, Guntur District, A.P. - 522005. Value : Rs.9.70 lacs

Guntur **Sd/- DVS PAVAN KUMAR**
Dt. 09/06/2023 **Branch Manager**

NOTICE
IN THE COURT OF THE 1st ADDL. DIST. JUDGE, GUNTUR.
MVOP 1144/2021

Between
Geddam Siva Kumari and others...Petitioners
And
Lavu Naga Malleswara Rao and others .... Respondents

R1 : Lavu Naga Malleswara Rao, S/o Anand Prasad, D.No. 53-276, 1st Line, Raghava Nagar, Guntur - 522002.

పై నెంబరు పిటీషన్‌ని పిటీషనర్లు నష్టపరిహారం కోరుచూ పై నెంబరు ఓ.పి.ని దాఖలు చేసినారు. అందులో 1వ రెస్పాండెంట్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయు చున్నందున ఈ వార్తాపత్రిక ద్వారా మీకు తెలియ జేయమని శ్రీ కోర్టువారు ది. 27-6-2023వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించ బడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా: 27-6-2023

ఇట్లు
కె.పట్టాభిరాముడు,
అడ్వకేట్, గుంటూరు.

అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A NO: 195/2022

IN

O.S NO 84/2015

భీమనాదం విజయలక్ష్మి వగైరాలు ......పిటిషనర్స్/ వాదులు

అండ్

భీమనాదం రాఘవరెడ్డి వగైరాలు .... రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

నోటీస్

To

R14 నలమలపు శివపార్వతి, భర్త చంద్రశేఖరరెడ్డి, సంగటిగుంట రెడ్ల బజార్, గుంటూరు.

వాదులు తాము దాఖలు చేసిన **I. A 108/2020, I. A 109/2020, I. A 110/2020** లలో జరిగిన కొన్ని పొరపాట్లును సవరించుటకు అనుమతి కోరుతూ దాఖలా చేసిన పై నెంబర్ పిటిషన్ లో మీకు నోటీసు ఉత్తరువు చేయబడింది. పై నెంబర్ పిటిషన్ లో మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్నచో అట్టివి 23-6-2023 వ తేదిన పై కోర్టు ఎదుట హాజరై తెలుపు కొనగలరు లేనిచో పిటిషన్ మీ పరోక్షమందు తీర్మానంకాగలదు.

అద్దంకి ఇట్లు

తేది: 09-06-23 **వెలగపూడి సుబ్రహ్మణ్యం**

వాదుల తరపు అద్వకేట్

స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న డిఆర్‌ఎం

పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో డిఆర్‌ఎం తనిఖీలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పిడుగురాళ్ల రైల్వే స్టేషన్లో గుంటూరు డివిజన్ రైల్వే మేనేజర్ రామకృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి సిబ్బంది, ప్రయాణికులతో మాట్లాడారు. ప్రయాణికులు ప్రస్తావించిన సమస్యలపై సిబ్బందిని వివరణ అడగడంతోపాటు వారి వద్ద సరైన సమాచారం లేకపోవడంపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన సదుపాయాలు కల్పించకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టేషన్లో రాత్రి సమయంలో కొన్ని రైళ్లకు స్టాపింగ్ ఇవ్వలేదని, వాటికీ హాల్ట్ ఇస్తే బాగుంటుందని పలు సంఘాల ప్రతినిధులు డిఆర్‌ఎం దృష్టికి తెచ్చారు.

ఈపూరు ఎంపిడిఒగా ఎవి రంగనాయకులు

ప్రజాశక్తి-ఈపూరు

ఈపూరు ఎంపిడిగా ఎవి రంగనాయకులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గంలోని బేస్తవారిపేట మండలంలో పంచాయతీ విస్తరణాధికారిగా పనిచేస్తూ ప్రమోషన్‌పై ఎంపిడిఒగా వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహించిన ఎ.ఉషాకిరణ్ తన స్థానమైన బొల్లాపల్లి మండలానికి తిరిగి వెళ్లారు.

సిసిఆర్‌సి కార్డులతో భూ యజమానికి నష్టం లేదు

ప్రజాశక్తి-ఈపూరు

కౌలు రైతులు కౌలు కార్డులు పొందాలంటే భూ యజమానులు సహకరించాలని, సిసిఆర్‌సి కార్డుల వల్ల భూ యజమానులకు నష్టమేమీ ఉండదని మండల వ్యవసాయాధికారి ఆర్.రామారావు అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఏవో మాట్లాడుతూ కౌలుకు భూమిని సాగు చేసే ప్రతి రైతు కౌలు కార్డులు పొందాలన్నారు. పొందిన వారికి పంటల బీమా, పంట రుణం, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, పంట నష్టపోతే పరిహారం వస్తుందని వివరించారు. రైతు భరోసా కేంద్రాల్లో 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఖరీఫ్‌కు ముందు వాటిని సాగు చేసి కలియ దున్నడం ద్వారా భూసారం పెంచుకోవచ్చని తెలిపారు. ప్రతిరైతు పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి బి.అప్పారావు, వ్యవసాయ సహాయకులు శేషు బాబు, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన డిఎల్‌పిఒ

ప్రజాశక్తి - నరసరావుపేట

నరసరావుపేట డివిజనల్ పంచాయతీ అధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ పుట్టా రమణయ్య శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. నెల్లూరు జిల్లా నుండి సాధారణ బదిలీలలో భాగంగా నరసరావుపేటకు వచ్చారు.

కౌల్దార్లకు కార్డు కోసం చట్టాన్ని సవరించాలి

- కౌలురైతు సంఘం రాష్ట్ర జాతా డిమాండ్
- పల్నాడు, గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటన
- ఘనస్వాగతం పలికి సమస్యలను విన్నవించిన కౌల్దార్లు
- 12న పాదయాత్ర, మంగళగిరిలో రాయభారానికి తరలిరావాలని నాయకుల పిలుపు

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడు, మండలంలోని లింగంగుంట్లలో జాతా పర్యటించింది. ఈ సందర్భంగా పలువురు కౌలురైతులు తమ సమస్యలను జాతా ఎదుట విన్నవించారు. తమకు కార్డులు రాలేదని కొందరు వచ్చిని రుణాలు ఏమీ ఇవ్వలేదని మరికొందరు వాపోయారు. రైతు భరోసా సైతం రాలేదన్నారు. వర్షాల వల్ల పంట నష్టపోయినా పరిహారం దక్కలేదని, భూ యజమానులకే ఇవి అందాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు జి.రవిబాబు, కె.రామారవు, లింగంగుంట్ల, పెదకూరపాడు, తాళ్లూరు గ్రామాల కౌలు రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి

సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో జాతాకు డప్పు కళాకారుల దరువుతో ఘన స్వాగతం లభించింది. అనంతరం సంఘ కార్యాలయం వద్ద జెండాను రాధాకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సంఘం మండల కార్యదర్శి పి.మహేష్ అధ్యక్షత వహించారు. జిల్లా అధ్యక్షులు కె.రామారావు మాట్లాడారు. 2011 కౌలు రైతు చట్టం ప్రకారం ఏడు లక్షల కార్డులిస్తే ప్రస్తుతం నాలుగు లక్షలు కూడా ఇవ్వడం లేదన్నారు. ఇచ్చిన వాటిల్లోనూ 30 శాతం బోగస్ అని చెప్పారు. గ్రామ సభల ద్వారా కౌల్దార్లను గుర్తించి కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు జి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ కారంపూడిలో బోగస్ కార్డులు ఇచ్చారని, వీటిపై ఫిర్యాదు చేయగా అవి రుజువైనా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కౌల్దార్ల ఉద్యమానికి సిఐటియు సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. సభలో ఎం.నరసింహారావు, ఎం.శివరాం, బి.రామారావు, డి.మేరమ్మ, లక్ష్మీనారాయణ, డి.వెంకటనారాయణ, ఎం.వెంకటరావు, డి.పెద్దతాతారావు, జె.అనూష, డి.సుజాత పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నరసరావుపేట, చిలకలూరిపేట

మాట్లాడుతున్న గుంటూరు విజయకుమార్

కౌలురైతులు సిసిఆర్‌సి (గుర్తింపు) కార్డులు పొందడానికి అవాంతరంగా ఉన్న భూ యజమాని సంతకం నిబంధనలను తొలగించాలని, ఇందుకోసం కౌలురైతు చట్టం-2019ను సవరించాలని కౌలురైతు సంఘం రాష్ట్ర జాతా డిమాండ్ చేసింది. ఈ మేరకు జాతా బృందం పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించింది. ఉదయం చిలకలూరిపేట మండలం యడవల్లిలో బయలుదేరిన జాతా నరసరావుపేట మండలంలోని కోటప్పకొండ, గురవాయపాలెం, యలమంద గ్రామాల మీదుగా నరసరావుపేటకు చేరుకుంది. జాతాకు ఘన స్వాగతం లభించగా స్థానిక ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభకు సంఘం మండల కార్యదర్శి కె.ఆంజనేయులు అధ్యక్షత వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ గతంలో భూ యజమానితో సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారా కౌలు రైతులను గుర్తించే వారని, వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత భూ యజమానితో ఒప్పందం చేసుకోవాలనే నిబంధన వల్ల 90 శాతం మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు రావడంలేదని తెలిపారు. దీనివల్ల పంట రుణాలు, పంట నమోదు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వంటి ప్రభుత్వ పథకాలకు వారు దూరమవుతున్నారన్నారు. చివరకు పంటను కూడా అమ్ముకోలేకపోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. చట్టంలో మార్పు చేయడం ద్వారానే కౌలు రైతులకు కొంతైనా న్యాయం జరుగుతుందన్నారు. మరోవైపు గుర్తింపు కార్డులున్న వారికి పంట రుణాల మంజూరులో బ్యాంకులు అనేక నిబంధనలు విధిస్తున్నాయని, దీంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై రైతులు ఆధారపడుతున్నారని, రుణభారం పెరిగి అప్పుల ఊబిలో కూరుకుని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాదాయ భూముల సాగుదార్లందరికీ గుర్తింపు కార్డులివ్వాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల్లో కల్తీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ కేరళ తరహాలో రుణ విమోచన కమిషన్ ఏర్పాటు చేసి రైతులు, కౌలు రైతులు ఆత్మహత్యలను నివారించాలని కోరారు. కేరళలో క్వింటాళ్ ధాన్యానికి రూ.2860 ధర లభిస్తోందని, రాష్ట్రంలోనూ సరైన మద్దతు నిర్ణయించి కొనుగోలు చేయాలని కోరారు. కౌలు రైతులందరికీ రైతుభరోసా వర్తింపజేయాలని, రైతు భరోసాను రూ.25 వేలకు పెంచాలని కోరారు. ఈ సమస్యలపై రానున్న రోజుల్లో ఐక్యపోరాటాలు చేస్తామని, 12న విజయవాడ నుండి ప్రకాశం బ్యారేజీ మీదుగా మంగళగిరి సిసిఎల్‌ఎ కార్యాలయం వరకు చేపట్టే పాదయాత్రకు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ అర్హులకు గుర్తింపు కార్డులు దక్కపోవడం ఒకెత్తయితే అనర్హులైన వైసిపి నాయకులకు కార్డులు మంజూరు చేశారని విమర్శించారు. భూమి ఉన్న రైతులు వ్యవసాయం గిట్టుబాటు కాక కౌలుకు ఇస్తున్నారని, ప్రస్తుతం సాగులో ఉన్న భూమిలో 70 శాతం విస్తీర్ణాన్ని కౌలురైతులే సాగు చేస్తున్నారని చెప్పారు. కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.రామారావు మాట్లాడుతూ కృష్ణాజిల్లా తోట్లవల్లూరులో శనివారం సాయంత్రం బహిరంగ సభ ఉంటుందని, ఆదివారం ఉదయం అక్కడ నుండి పాదయాత్రగా బయలుదేరి సాయంత్రానికి విజయవాడకు చేరుకుంటుందని, సోమవారం విజయవాడ నుండి మంగళగిరి చేరుకుని భూ పరిపాలన ప్రధాన అధికారి కార్యాలయం వద్దకు ఉదయం 11 గంటలకు చేరుతుందని వివరించారు. బహిరంగ సభ, పాదయాత్రల్లో కౌల్దార్లు అదిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఇదిలా ఉండగా జాతకు శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, సిఐటియు నాయకులు ఇ.మస్తాన్‌రెడ్డి, సిఐటియు మండల నాయకులు సిలార్ మసూద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.బాల కోటయ్య తదితర ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమాల్లో జి.లక్ష్మీపతి, పి.వెంకటేశ్వర్లు, వెంకట్రావు, సుబ్బయ్య, హనుమంతరావు, ఐ.కోటేశ్వరరావు, డి.రాంబాబు, బి.పుల్లారెడ్డి, ఎస్.వెంకటేశ్వరరెడ్డి, డి.దేవదాసు, యడవల్లి, పమిడిమర్రు, ఎల్లమంద, గురవాయపాలెం, గ్రామాల కౌలు రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ముప్పాళ్ల

మండల కేంద్రమైన ముప్పాళ్లకు చేరిన జాతాకు రైతు, కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయం నిర్వహించిన సభలో రాధాకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ, కౌలురైతు సంఘం మండల కార్యదర్శి టి.అమరలింగేశ్వరరావు, ఎం.జగన్మోహన్‌రెడ్డి, వెంకటాచారి, ఎన్.సాంబశివరావు, జి.జాలయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లికి జీపుజాతా చేరుకున్న సందర్భంగా స్థానిక పుతుంబాక భవన్లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ గుర్తింపు కార్డులు లేని కారణంగా కౌల్దార్లను ఈ-క్రాప్‌లో నమోదు చేయడం లేదని, దీంతో పంట నష్టపరిహారం, ఇతర రాయితీలు దక్కడం లేదని చెప్పారు. ఓసీల్లోని భూమిలేని కౌల్దార్లకూ గుర్తింపు కార్డులు, రైతు భరోసా ఇవ్వాలన్నారు. పంటలకు మద్దతు ధరలు దక్కక నష్టాలొస్తున్నాయని, మొక్కజొన్నకు రూ.1962 మద్దతు ధరున్నా బహిరంగ మార్కెట్లో రూ.1500-1600కు కూడా కొనడం లేదని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనడం లేదని, ధాన్యానికి అదనంగా ప్రభుత్వం బోనస్ ఇచ్చి కొనాలని డిమాండ్ చేశారు. కేరళలో వరుసగా మూడేళ్లు ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులకు నష్టం వస్తే ప్రభుత్వం కమిషన్ వేసి ఆ నష్టాన్ని ప్రభుత్వమే భరిస్తోందని, రాష్ట్రంలోనూ ఈ ఏర్పాటు చేస్తే ఆత్మహత్యలుండవని అన్నారు. సమావేశంలో జి.బాలకృష్ణ, కె.రామారావు, బి.బాల కోటయ్య, జి.లక్ష్మీపతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని సిరిపురం, వెలవర్తిపాడులో శుక్రవారం రాత్రి జాతా పర్యటించింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడగా గుంటూరు జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, నాయకులు బి.రామకృష్ణ, లక్ష్మీపతి, డి.కాంతారావు, కె.రామారావు పాల్గొన్నారు.

విఆర్‌ఒకు వినతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌల్దార్లందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని మండలంలోని వీరాపురం విఆర్‌ఒ సిహెచ్ కాశయ్యకు శుక్రవారం కౌలు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కౌల్దార్ల సమస్యలపై సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు వివరించారు. టి.సుబ్బయ్య, ఎ.పిచ్చిరెడ్డి, శ్రీధర్, ఎస్.మురళికృష్ణ, టి.గణేష్, శేషగిరిరావు, టి.నాగేశ్వరరావు, జి.పిచ్చేశ్వరరావు పాల్గొన్నారు.

మతోన్మాద బిజెపిపై అమరుల స్ఫూర్తితో పోరాటం

- సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు
- పాలపర్రు అమరవీరులకు ఘన నివాళి
- పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్

ప్రజాశక్తి - పెదనందిపాడు

జెండా ఆవిష్కరిస్తున్న అన్నలదాసు ఆశీర్వాదం

భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన నాటి వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరా టంలో అమరులైన పాత బాపట్ల తాలూకా అమరవీరుల స్ఫూర్తితో మతోన్మాద బిజెపికి వ్యతిరేకంగా పోరాడాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపిచ్చారు. శుక్రవారం పెదనందిపాడు మండలం పాలపర్రులో అమర వీరుల సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా పాలపర్రులోని సిపిఎం కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ సిపిఎం సీనియర్ సభ్యులు అన్నలదాసు ఆశీర్వాదం ఆవిష్కరించారు. అనంతరం సిపిఎం శ్రేణులు, నాయకులు మృత వీరుల స్మారక స్థూపం వరకు ర్యాలీ నిర్వహించి అమరులకు ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు అధ్యక్షతన నిర్వహించిన సభలో రామారావు మాట్లాడుతు పాత బాపట్ల తాలూకా అమరవీరుల సంస్మరణ సభ ప్రతి సంవత్సరం సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తూ వారికి నివాళులర్పిస్తూ వస్తున్నామని తెలిపారు. వారి పోరాట స్ఫూర్తిని తీసుకొని నేటి మతోన్మాద బిజెపి, ఆర్ఎస్ఎస్ లపై పోరాడాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. నేడు అధికారంలో ఉన్న బిజెపి మతోన్మాద వైఖరిని అవలంబిస్తూ భారత రాజ్యాంగాన్ని, లౌకిక తత్వాన్ని కాలరాస్తుందని తెలిపారు, రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారు. మన రాష్ట్రానికి బిజెపి తీవ్ర అన్యాయం చేసిందని తెలిపారు. ప్రత్యేకహోదా, పోలవరానికి నిధులు, కడపకు రైల్వే జోన్, రాజధాని నిర్మాణానికి నిధులు వంటి విభజన హామీలు నెరవేర్చకుండా మోసం చేసిందన్నారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపి పట్ల రాష్ట్రంలోని ప్రతిపక్ష టిడిపి, అధికార పక్ష వైసిపి పార్టీలు సానుకూల ధోరణి అవలంబిస్తున్నాయని, అదే విధంగా విద్యారంగాన్ని కూడా బిజెపి కాషాయకరణ చేస్తూ చరిత్రను వక్రీకరిస్తుందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతూ, జాతి సంపదను వారికి దోచిపెడుతున్నారని

పాలపర్రు గ్రామంలో ర్యాలీ

విమర్శించారు, వ్యవసాయ రంగాన్ని కూడా కార్పొరేట్ల పరం చేసేందుకు మూడు వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చారని, కార్మిక హక్కులను కాలరాసే విధంగా నాలుగు లేబర్ కోడులను ప్రవేశపెట్టారన్నారు. ఈ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అమరవీరుల స్ఫూర్తితో పోరాడాలని, బిజెపిని ఒంటరి పాటు చేసి, గద్దె దించాలని పిలుపునిచ్చారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై పెనుభారాలు మోపటం తగదన్నారు. అసలే నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలపై విద్యుత్ ఛార్జీలు భారం మోపటం సమంజసం కాదని, వెంటనే తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, రైతు సంఘాల ఐక్యవేదిక నాయకులు సరిశెట్టి ఆచార్యులు, నాయకులు కుర్రా హరిబాబు మాట్లాడుతు గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని, భూసేకరణకు వెంటనే నిధులు కేటాయించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అమరవీరులకు నివాళులు అర్పించిన వారిలో సిపిఎం నాయకులు పోపూరి సుబ్బారావు, జరుగుల శంకర్రావు, జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, దేవరకొండ శ్రీనివాసరావు, కొత్త వెంకటశివరావు, చుక్కా యానాదులు, ఫణిదం భువనేశ్వరి, బండి శంకరయ్య, లావు వెంకట నాగేశ్వరరావు, మద్దూరి రమణ, పెద్దిపాక బాపిరాజు, చెన్నుపాటి సురేంద్ర, ఎన్ భగవాన్ దాస్, పసుపులేటి శేషగిరిరావు లు ఉన్నారు.

నాటి కాంగ్రెస్ ప్రభుత్వ దమనకాండలో

అశువులు బాసిన అమరవీరులు

బొందలపాటి అమ్మయ్య (26), పెద్దిపాగ ప్రకాశం(20), నాగభైరు వీరయ్య (28), పోపూరి రంగారావు (18), సరికొండ అప్పలరాజు (24), కరణం శ్రీరాములు (24), బత్తుల ధనుంజయుడు (24), బండారు వెంకటప్పయ్య (20), చివుకుల శేషశాస్త్రి(33), ముక్తినూతల లక్ష్మీనారాయణ(36), కస్తూరి కుటుంబరావు (43), సజ్జా సూర్య బాలానందం(32), బండారు వెంకటేశ్వర్లు (22), జెట్టి సుబ్బారావు(32).

మాట్లాడుతున్న జెసి రాజకుమారి

1 నుంచి గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్

ప్రజాశక్తి-గుంటూరు

సప్లిమెంటరీ న్యూట్రీషన్ ప్రోగ్రామ్‌లో సేవలను మెరుగుపరచటానికి జులై 1వ తేదీ నుంచి గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు టేక్ హోం రేషన్ ఇవ్వనున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. గురువారం జెసి అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో పౌర సరఫరాల శాఖ ద్వారా సరఫరా అవుతున్న బియ్యం, కందిపప్పు, నూనె అంగన్వాడి కేంద్రాలకు నెల మొదట్లో ముందుగా సరఫరా చేయాలని ఆదేశించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ మనోరంజని మాట్లాడుతూ టేక్ హోం రేషన్ కిట్‌లో మూడు కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, నూనె అర లీటర్, రాగి పిండి, జొన్న పిండి, అటుకులు ఒక్కొకటి ఒక కేజీ చొప్పున, బెల్లము పావు కేజీ, ఎండు ఖర్జూరం, వేరుశనగ చిక్కి ఒక్కొకటి ఒక పావు కేజీ చొప్పున, ఒకే కిట్‌గా నెల మొదట్లో లబ్దిదారులందరికీ ఒకేసారి ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. సమీక్షలో జిల్లా సివిల్ సప్లైస్ తహశీల్దార్లు, డిఎస్ఒ పద్మ, సివిల్ సప్లైస్ డిఎం జి.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వికాస్‌కుమార్

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మెగా అవుట్‌రీచ్ క్యాంపెయిన్

ప్రజాశక్తి-గుంటూరు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని క్యాపిటల్ హోటల్‌లో శుక్రవారం మెగా అవుట్‌రీచ్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సమావేశంలో గుంటూరు రీజియన్‌లోని స్థానిక శాఖలకు చెందిన సుమారు వందమంది కష్టమర్లు, కాబోయే కస్టమర్లు హాజరయ్యారు. బ్యాంకు అధికారులు వారి సిఎస్ఎ, రిటైల్ వ్యవసాయం, ఎంఎస్ఎంఇ, డిజిటల్ ఉత్పత్తులను గురించి వివరించారు. సమావేశానికి ముంబై సెంట్రల్ ఆఫీసు జనరల్ మేనేజర్ వికాస్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి జోనల్ ఆఫీసు హెడ్ మురళీ పార్థసారథి, గుంటూరు రీజనల్ హెడ్ కుందన్‌లాల్ ప్రసంగించారు.

జిఎంసి ఉద్యోగులకు క్రీడా పోటీలు : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

సమిష్టి కృషితో నగరాభివృద్ధికి కృషి చేయాలని, నగరపాలక సంస్థ ఉద్యోగులకు క్రీడా పోటీల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తిచేకూరి అన్నారు. వ్యక్తిగత సెలవు అనంతరం భాధ్యతలు తీసుకున్న కమిషనర్‌ను విభాగాధిపతులు, అధికారులు, సిబ్బంది, మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కమిషనర్ చాంబర్‌లో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరాభివద్ధికి అధికారులు స్థానిక ప్రజలతో కలిసి పని చేయాలని, నగర సమగ్రాభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాధ్యత తీసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ ఉద్యోగులు, సిబ్బందికి క్రీడా పోటీలు నిర్వహించడానికి షెడ్యూల్ సిద్ధం చేయాలని డిప్యూటీ కమిషనర్‌ని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో వార్డు సచివాలయం ద్వారా ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందేలా చూడాలని, ప్రజల నుండి అందే అర్జీలు, ఫిర్యాదులు పక్కాగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది, అధికారుల సమస్యలు కూడా ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కష్ణయ్య, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, డిసిపి కోటయ్య, మేనేజర్ శివన్నారాయణ, ఎసిపిలు, ఈ.ఈ.లు, డి.ఈ.ఈ.లు, రెవెన్యూ అధికారులు, మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు పోలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువను పరిశీలించిన తాడేపల్లి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్, రైతు సంఘం నాయకులు

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

పంట కాల్వను పరిశీలించిన తాడేపల్లి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్

సాగునీరులో మురుగునీరు కలవకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి : ఎపి రైతుసంఘం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఆంధ్ర రత్న పంపింగ్ స్కీం నుండి కుంచనపల్లి, ప్రాతూరు గ్రామాల పరిధిలో రైతులు పండించే, పంటలకు సాగునీరు అందించే పంట కాలువ వ్యర్థాలతోనూ, మురుగునీరుతోను నిండిపోయి అస్తవ్యస్తంగా తయారైంది. పాడైన పంటకాలను పరిశీలించేందుకు శుక్రవారం ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి గ్రామ పరిధిలోని అపర్ణ అపార్ట్మెంట్స్ వద్ద ఉన్న పంటకాలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులతో కలిసి తాడేపల్లి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ బి శివారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా ఉన్న మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. అదేవిధంగా సాగు నీరు అందించే పంట కాలువలో మురుగునీరు చేరకుండా ప్రత్యామ్నాయం చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ ఆంధ్ర రత్న పంపింగ్ స్కీం నుండి సుమారు 3565 ఎకరాలకు సాగునీరు అందించే పంట కాలువ లో అపార్ట్మెంట్స్ లో వాడే వ్యర్థపు నీరు, మురుగునీరు కలవడం వలన రైతులు పండించే పంటల దిగుబడి లేకుండా పోయిందన్నారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారని గతంలో అనేక సార్లు అధికారులు దష్టికి తీసుకువెళ్లిన సమస్య పరిష్కారం కాలేదని ఆయన ఆవేదన చెందారు. కుంచనపల్లి, ప్రాతూరు, గుండె మెడ, చిరావూరు గ్రామాల పరిధిలో ఆకుకూరలు, కాయగూరలు రైతులు పండిస్తారని ఆయన అన్నారు. తక్షణమే పంట కాలువలో మురుగునీరు చేరకుండా, పటిష్ట చర్యలు చేపట్టి, రైతుల పంట పొలాలలో మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ శివారెడ్డిని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు మోదుగుల శ్రీనివాసరెడ్డి, దొంతి రెడ్డి వెంకటరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, నీటి సంఘం మాజీ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు, కొమ్మారెడ్డి బుజ్జి, వీరిశెట్టి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

వడ్డేశ్వరంలో తహశీల్దార్ నాగిరెడ్డికి పేదల సమస్యను తెలుపుతున్న సిపిఎం నాయకులు

పేదల ఇళ్ల సమస్యను పరిష్కరిస్తాం

వడ్డేశ్వరంలో నిరుపేదల గృహాలను పరిశీలించిన తహశీల్దార్ నాగిరెడ్డి

ఇళ్లస్థలాలను రెగ్యులరైజ్ చేసి పట్టాలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో ఇళ్లు లేని నిరుపేదలు వేసుకున్న ఇళ్లను శుక్రవారం సాయంత్రం తాడేపల్లి మండల తాసిల్దార్ నాగిరెడ్డి రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి ఎమ్మార్వో ను కలిసి వడ్డేశ్వరంలోని సర్వే నెంబర్ 40 లో నిరుపేదలు గత 16 సంవత్సరాల క్రితం ఇళ్లు వేసుకుని నివసిస్తున్నారని అన్నారు. సరైన మౌలిక వసతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్న పేదల ఇళ్లను రెగ్యులర్ చేయాలని, ఒక్కో కుటుంబానికి రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలం కేటాయించాలని ఎమ్మార్వో ని కోరారు. పేదలు ఇల్లు వేసుకున్న ప్రాంతంలో మంచినీటి సౌకర్యం లేక, మురుగునీరు పారుదల లేక, దోమలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో ఇళ్ళు వేసుకున్న పేదలందరూ ఎస్సీ, ఎస్టి, బీసీ, మైనార్టీలని, రోజువారి కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారని అన్నారు. ఇప్పటికే అనేక సందర్భాలలో అధికారులను కలిసి పేదల సమస్యను విన్నవించామని వెంకటరెడ్డి అన్నారు.

స్పందించిన తాడేపల్లి మండల తాసిల్దార్ నాగిరెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి వడ్డేశ్వరం పేదల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తామని స్థానికులకు, సిపిఎం నాయకులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వడ్డేశ్వరం గ్రామ విఆర్ఓ ఆశ, గ్రామ సర్వేయర్ గోపీచంద్, వైఎస్ఆర్సిపి మండల నాయకులు కత్తిక రాఘవరావు, ఎస్సీ కాలనీ వాసులు మధిర శ్యాం, బుల్లా రూపు, కారసాల స్వాతి, చిన్ని, ఎస్ కే బాజీ, మరియా బాబు, వడ్డేశ్వరం చిన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఈపూరు, ముప్పాళ్ళ, కొచ్చర్ల, ఊడిజర్ల గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ,33 కేవీ విద్యుత్ లైన్లు, ట్రాన్స్ ఫార్మర్ల మరమ్మతుల కారణంగా ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని, ఈ విషయమై విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కాలువలో పూడికతీత పనులు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల పట్టణం పదవ వార్డు శెరిన్ కాలనీలో గత కొంతకాలం నుండి కాల్వకు అడ్డుగా మట్టి పేరుకుపోయి మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఆ ప్రాంత వాసులు విషయాన్ని కమిషనర్ రమణబాబు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కమిషనర్ రమణబాబు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. శుక్రవారం దగ్గరుండి పర్యవేక్షిస్తూ పొక్లెయిన్ సహాయంతో కాల్వకు అడ్డుగా ఉన్న మట్టిని తొలగించారు. సమస్యను చెప్పిన వెంటనే పరిష్కరించిన కమిషనర్‌కు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యా సంస్థలకు వేసవి సెలవులు పొడిగించండి

ప్రజాశక్తి - నరసరావుపేట

విద్యా సంస్థలకు వేసవి సెలవులను పొడిగించాలని దళిత బహుజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రొంపిచర్ల మండలం నల్లగార్లపాడులోని అంబేద్కర్ నగర్ లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలోఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత బాగా ఎక్కువగా ఉందని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యాసంస్థలు తరగతులు నిర్వహిస్తే విద్యార్థినీ, విద్యార్థులు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని అన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని విద్యా సంస్థలకు వేసవి సెలవులను పొడిగించాలని కోరారు.

మాట్లాడుతున్న ఎంఎంసి ఛైర్మన్ సిహెచ్. వెంకటేశ్వర్లు

రైతు ప్రయోజనాల కోసం అవగాహనా సదస్సులు

ప్రజాశక్తి-ఈపూరు

రైతు ప్రయోజనాల కోసం రైతు అవగాహన సద స్సులు నిర్వహించాలని ఈపూరు ఎఎంసి ఛైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో పాలకవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ యార్డు ద్వారా రైతులకు అందించాల్సిన సేవలు,ఆదాయ రాబడి,ఖర్చు తదితర అంశాలపై చర్చించారు. వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలోని బొల్లాపల్లి, ఈపూరు, శావల్యాపురం మండలాల రైతుల అవసరాలకు అనుగుణంగా మినీ కోల్డ్ స్టోరేజ్, రైతు సదస్సు, పశువైద్య శిబిరం సీజనల్ చెక్ పోస్టులు ఏర్పాటుపై తీర్మానం చేసి ఉన్నతాధికారు లకు పంపుతున్నట్లు యార్డు కార్యదర్శి మురళీధర్ తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ ఛైర్మన్ బి.శ్రీరామ్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు

- ఒకవైపు తాగునీరు రాదు
- మరోవైపు మురికినీటి సరఫరా
- కారెంపూడిలో ప్రజల పాట్లు

ప్రజాశక్తి - కారెంపూడి

ఒకవైపు మండే ఎండలు అల్లాడిస్తుంటే, మరోవైపు తాగునీటి కోసం ప్రజలు ఎదురుచూసే పరిస్థితి కారెంపూడి పట్టణంలో నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో పంచాయతి తాగు నీరు రాకపోతుండగా, మరికొన్ని ప్రాంతాల్లో బురద నీరు వస్తుండటంతో ప్రజలకు దిక్కుతోచడం లేదు. ఇందిరాగాంధీ బొమ్మ సెంటర్‌లోని బోర్ల ద్వారా గ్రామం మొత్తానికి నీటి సరఫరా జరుగుతుంది. ఆయా ప్రాంతాల్లో నిత్యం మోటార్లు, వాల్స్ రిపేర్ రావడంతో తాగునీటి సర ఫరా జరగట్లేదు. రోజులు తరబడి ఎదురు చూడాల్సిన పరి స్థితి నెలకొంది. సుమారు నెల రోజుల క్రితం ఎస్సీ కాలనీలోని నూతన బోరు ఏర్పాటు చేశారు. దానికి మంచినీటి పైపులు ఏర్పాటు చేసి కొన్ని ప్రాంతాలకు తాగు నీటి సరఫరా చేస్తున్నారు. అయితే, ఆ తాగునీరు మురికిగా, వాన పాము లతో వస్తున్నాయని స్థాని కులు అన్నపురెడ్డి మల్లేశ్వరి, పలిశెట్టి సైదమ్మలు చెప్పారు. ఈ విషయమై అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని అన్నారు. ఇప్పటికైనా పంచాయతి అధికారులు స్పందించి పట్టణంలో సక్రమంగా తాగునీటి సరఫరా చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఈ విషయమై పంచాయతి కార్యదర్శి కసిన్య నాయక్‌ను వివరణ కోరగా కొన్ని ప్రాంతాల్లో మంచినీటి సరఫరాలో వాల్స్ రిపేర్ కారణంగా పూర్తి స్థాయిలో సరఫరా చేయలేకపోతున్నామన్నారు. మురికినీరు వచ్చే ప్రాంతాల్లో రెండు రోజుల్లో మరొక నూతన బోరు ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా అయ్యేలా చేస్తామని చెప్పారు.

ఎస్సీ కాలనీలో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన బోర్, ప్లాస్టిక్ బాటిల్‌లో మురికినీరు

గుండ్లపల్లిలో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - నకరికల్లు

పల్నాడు జిల్లాలో చేపట్టిన గ్రామోదయం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ గుండ్లపల్లి గ్రామాన్ని మండల స్థాయి అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు. గ్రామంలో సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అమలు వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. రక్త హీనత ఉన్న పిల్లలను గుర్తించి వారి తల్లి దండ్రులకు పలు సూచ నలు, సలహాలు అందజేశారు. పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనుల పురోగతిని పరిశీలించి..పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారు లను ఆదేశించారు.

క్లాత్ మిత్ర సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

విద్యార్థులకు జేవీకే కిట్లను సకాలంలో అందించాలన్నారు. మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చెత్తను తొలగించాలని పంచాయతీ సిబ్బందికి సూచిం చారు. అంగన్వాడి కేం ద్రంలోని రికార్డు లను, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలిసి అల్పాహారం స్వీకరించారు. గ్రామంలో ఎస్సీ ఎస్టీ కాలనీల స్మశానాలకు దారి కావాలని కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు

పిల్లలందరూ విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి - నరసరావుపేట

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని, సచివాలయాల సిబ్బందితో రాష్ట్ర బాలల హక్కుల పరి రక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి అన్నారు. రాష్ట్రంలోని గ్రామ,వార్డు సచివాలయాల సిబ్బంది యావత్తు భాగస్వాములై బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషించాలని కోరారు. పట్టణంలోని 32, 33, 34 వార్డుల సచివాల యాల సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు.

మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బి.పద్మావతి

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలం దరూ విద్యాలయాల్లో విద్యను అభ్యసించాలని, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పిం చాలని ఆమె కోరారు. ఆరోగ్య కార్యకర్తలు తరచూ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లోని బాలలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, రక్తహీనత లేకుండా జాగ్ర త్తలు పాటించేలా చూడాలని సూచించారు. వికలాంగ బాలలకు పెన్షన్లు జారీ, వారిని పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. సమతుల్య పోషకాహారం అందించేలా ప్రభుత్వ అధికారుల పనితీరుపై డేగ కళ్లతో ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని చెప్పారు. రెవెన్యూ కార్యదర్శులు విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో కుల,ఆదాయ, నివాస ధ్రువీకరణ తో పాటు ఇతర ధ్రువీకరణ పత్రాల జారీలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో స్త్రీ సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ అరుణ, చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఉమా మహేశ్వరి పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ దాడులు

అదనపు లోడ్ వాడుతున్న సర్వీసులకు జరిమానా

ప్రజాశక్తి - చిలకలూరిపేట

చిలకలూరిపేట రూరల్ మండలంలో సిఆర్‌డిఎ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.విజయ్‌కుమార్ నేతృత్వంలో శుక్రవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ దాడులు నిర్వహించినట్లు సంబంధిత శాఖాధికారులు చెప్పారు. స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో అధికారులు మాట్లాడుతూ చిలకలూరిపేట రూరల్ మండలంలో దాడులు నిర్వహించారు. గుంటూరు టౌన్ 2, విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సిహెచ్.రమేష్, కెవిఎల్ ఎన్ మూర్తి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. ఈ సందర్భంగా పట్టణ డిఇఇ ఆర్. అశోక్ మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో 29 బృందాలు దాడులు నిర్వహించినట్లు చెప్పారు. అదనపు లోడ్ వాడుతున్న 88 సర్వీసులను గుర్తించామని నష్టపరిహారం కింద రూ.3,89,400 అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు. ఈ దాడులలో ముగ్గురు డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్స్, 11 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు, విద్యుత్ శాఖ సిబ్బంది,చిలకలూరిపేట రూరల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆర్. ప్రకాశరావు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

ప్రజాశక్తి - నాదెండ్ల

జిల్లాలోని పీఎం కిసాన్ లబ్ధిదారులు తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాలని పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఐ. మురళి అన్నారు మండలంలోని సాతులూరు గ్రామంలో శుక్రవారం ముఖ ఆధారిత ఈ కేవైసీ విధానాన్ని పరిశీలించారు. పల్నాడు జిల్లాలో 33,900 మంది రైతులు ఈ కేవైసీ చేయాల్సిందిగా తెలిపారు. ఈ కేవైసీ చేయని రైతులకు 14వ విడత పిఎం కిసాన్ నిధులు మంజూరు కావని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం డిప్యూటీ వ్యవసాయ సంచాలకులు వెల్ఫేర్ సెక్షన్ ఎం.పద్మావతి, సహాయ వ్యవసాయకులు ఇ.మస్తానమ్మ మండల వ్యవసాయ అధికారి హరి ప్రసాద్ పాల్గొన్నారు.

11న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-ఈపూరు

ఎపి మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 11వ తేదీన మండల కేంద్రమైన ఈపూరు కేజీబీవీ పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వల్లెపు శ్రీను శుక్రవారం తెలిపారు. విద్యార్థులు http://apms.ap.gov.in అనే వెబ్ సైట్‌లో హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని, 9 గంటలకు పరీక్ష కేంద్రం వద్దకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.

చంద్రబాబు, లోకేష్‌లకు ఏదైనా జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత: పుల్లారావు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, నేత లోకేష్‌లపై వైసిపి ప్రభు త్వం కుట్ర చేస్తోందని టిడిపి రాష్ట్ర ఉపా ధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు ఆరో పించారు. స్థానిక పండరీపురం లో తన నివాసంలో శుక్ర వారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ చంద్రబాబు 'జడ్' ప్లస్ భద్రతపై వైసిపికి ఎందుకంత కడుపుమంట? ఆ భద్రత తొలగించా లని వైసిపి నేతలు పదే పదే ఎం దుకంటున్నారు? చంద్రబాబుకు కల్పిస్తున్న భద్రతపై సభాపతి, ఉపసభాపతి చేస్తున్న వ్యాఖ్యల వెనుక ఉద్దేశ మేమి టని ప్రశ్నించారు. రాష్ట్ర పోలీస్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని చంద్రబాబుపై కుట్రకు ప్రణాళిక చేస్తున్నారనే అనుమానం కలుగు తోందని అన్నారు. చంద్రబాబుకు, లోకేష్‌కి ఏదైనా జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత అని అన్నారు. కేంద్రం విడుదల చేసిన రూ.10 వేల కోట్లతో పాటు పోల వరానికి వచ్చే నిధు లను కాజేయాలన్న దురాలోచనతో ఉన్నా రని ఆరోపించారు. సీపీఎస్ కాదు జీపీఎస్ అంటూ ఉద్యోగులను మోసం చేసిన చరిత్ర జగన్ దేనని విమర్శించారు.

భూ యజమాని సంతకం నిబంధన తొలగించండి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

భూ యజమానితో సంబంధం లేకుండా(సిసిఆర్ సి) కార్డును కౌలు రైతుకు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకం రావు అన్నారు. శుక్రవారం ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి లో మూడు ప్రాంతాలలో కౌలు రైతులకు కర పత్రాలు పంపిణీ చేస్తూ, కౌలు రైతు సంఘం నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివ శంకరరావు మాట్లాడుతూ ప్రస్తుత తరు ణంలో కౌలుతో వ్యవసాయం చేసే కౌలు రైతులు పం డించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లేక, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

కుంచనపల్లిలో కరపత్రాలు పంచుతూ, ప్రచారం నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు

కౌలు రైతులు బ్యాంకుల నుండి రుణాలు పొందేందుకు భూ యజ మాని సంతకం ఉం డాలన్న అధికారుల నిబంధన సరైన పద్ధతి కాదన్నారు. అనుకోకుండా ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నప్పుడు పంటలో నష్టపోయి, నష్టపరిహారం అందక కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోతు న్నారన్నారు. తక్షణమే భూ యజమాని సంతకం ఉండా లన్న నిబంధనను తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదే విధంగా ఈ నెల 12వ తేదీన కౌలు రైతుల సమస్యలపై మంగళగిరి లోని సిసిఎల్ ఏ కార్యాలయం వద్ద జరిగే రాయబార కార్యక్రమంలో కౌలు రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్య క్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కష్ణ, రైతు సంఘం మండల నాయకులు అమ్మిశెట్టి రంగారావు, అమ్మిశెట్టి రామారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పొన్నూరు ఎడిఎ గా వి. రామకోటేశ్వరి నియామకం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు వ్యవసాయ సహాయ సం చాలకులుగా ఎడిఎ గా వి.రామకోటేశ్వరి శు క్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లా డుతూ బాపట్ల జిల్లా డిఎఒ కార్యాలయం నుండి పొన్నూరుకు బదిలీ అయినట్లు ఆమె తెలిపారు. పొన్నూరు సబ్ డివిజన్ పరిధి లో రైతు లందరికి అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలను ప్రతి రైతుకూ అందిం చేందుకు కృషి చేస్తానని చెప్పారు.

చర్మకారులకు గొడుగులు పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణంలో వివిధ ప్రాంతాల్లో చెప్పులు కుట్టు కునే వారికి వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మంగళగిరి తహశీల్దార్ కార్యాలయంలో గొడు గులను పంపిణీ చేశారు. ఎండకు వారు పడుతున్న ఇబ్బం దులను గమనించి ఈ గొడుగులను పంపిణీ చేసినట్లుగా క్లబ్ అధ్యక్షురాలు కనకదుర్గ, కార్యదర్శి గాయత్రి తెలిపారు. తహ శీల్దార్ జివి రామప్రసాద్, క్లబ్ జిల్లా ఇంచార్జ్ జి.సుజాత, ఆర్యవైశ్య ప్రముఖులు భగవన్నారాయణ, ఎం.వేణు గోపాలకృష్ణ, చర్మ కారు సంఘం నాయకులు బి.రాజారావు పాల్గొన్నారు.

సుకుమార్‌ను సత్కరిస్తున్న ఎపిడబ్ల్యూజెఎఫ్ బృందం

న్యాయసేవలపై ప్రజల్లో అవగాహన పెరగాలి

ప్రజాశక్తి-తెనాలి

న్యాయవ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలని, ఉచిత న్యాయసేవలను ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని సీనియర్ ఎపిపి సుద్దపల్లి సుకుమార్ అన్నారు. గుంటూరు నాల్గవ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ జువైనల్ జస్టిస్ కోర్టు సీనియర్ ఎపిపిగా ఇటీవల ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎపి వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కనపర్తి రత్నాకర్ ఆధ్వర్యంలో స్థానిక టాలెంట్ ఎక్స్‌ప్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా సుకుమార్ మాట్లాడుతూ న్యాయవ్యవస్థలోనూ సాంకేతిక పరిజ్ఞానం అవసర మన్నారు. వృత్తి పరంగా కేసుల సత్వర పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఫెడరేషన్ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి పి.పున్నయ్య, వేమూరు నియోజకవర్గ అధ్యక్షులు ఎం.సుబ్బారావు, సీనియర్ సభ్యులు జి.ప్రభాకరరావు, శేఖర్, న్యాయవాది జి.మధుకర్, ఎ.సంజయ్, ఎ.రమేష్. కె.రమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ వ్యర్థాలను కాల్చొద్దు .. నేలలో కలియదున్నండి

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

స్థానిక మండల వ్యవసాయ శాఖాధికారి కార్యా లయంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మం డలి సమావేశం నిర్వహించారు. సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షులు భవనం పద్మలీల, జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, జిల్లా వ్యవ సాయ సలహా మండలి సభ్యులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు హాజరయ్యారు. రంగారావు మాట్లా డుతూ వ్యవసాయ వ్యర్థాలను కాల్చకుండా నేలలో కలియదున్ని నేల ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ,ఇందుకు అవసరమైన వ్యవసాయ యంత్ర పరికరాలు డికంపోజర్స్ అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఇలా చేయడం ద్వారా భూమిలో సూక్ష్మజీవుల సాంద్రత పెరిగి నేల ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. పద్మ లీల మాట్లా డుతు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట ఎరు వుల విత్త నాలు ప్రతి ఆర్‌బికెలలో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. రైతులందరూ పచ్చిరొట్ట ఎరువులను వాడు కొని నేల ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని సూచిం చారు. తదుపరి పొన్నూరు మండల వ్యవసాయ శాఖా ధికారి డేగల వెంకటరామయ్య మాట్లాడుతూ రైతు భరోసా ఆర్థిక సాయం అర్హులైన ప్రతి ఒక్క రైతుకి వారి ఖాతాలలో జమ చేయడం జరిగిందని చెప్పారు. తొలకరి వర్షాలు రాగానే నేలల్ని ఖరీఫ్ పంటకు అనుకూలంగా దున్నుకోవాలని, ఇలా చేయడం ద్వారా కలుపు మొక్కల ఉధృతిని తగ్గించ వచ్చని అన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి భవనం పద్మలీల

ప్రజాశక్తి - ఫిరంగిపురం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శు క్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. సమావేశానికి వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దేవగిరి బుచ్చిరెడ్డి అధ్యక్షత వహిం చారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు షేక్ నర్గీస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

మండల వ్యవ సాయ శాఖాధికారి కె.రమణ కుమార్ పచ్చిరొట్ట ఎరు వుల ప్రాముఖ్యతను గురించి వివరించారు.గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా వంద మట్టి నమూ నాలను సేకరించి ల్యాబ్‌లో విశ్లేషిస్తామని చెప్పారు. రైతు లకు ఎరువులు, సూక్ష్మధాతు లోపాల గురించి వివరించి ఎరువులు వాడకాన్ని తగ్గిస్తామని అన్నారు. సమా వేశంలో తహశీల్దారు డి.పద్మనాభుడు,ఎంపిడిఒ అను రాధ, సాహెలా నర్గీస్, మండల ఉద్యాన అధికారి అశోక్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు జి.చంద్రం పాల్గొన్నారు.



యర్రబాలెం లే అవుట్‌లో ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి సెంటర్ సచివాలయ పరిధిలోని 195 మందికి శుక్రవారం ఇళ్లపట్టాలు అందజేశారు. యర్ర బాలెం లేఅవుట్‌లో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులు పట్టాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే నెల 8 నుంచి సామూహిక శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి నాటికి గృహ ప్రవేశాలు చేసేలా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, వైసిపి జిల్లా ప్రధాన కార్య దర్శి ఇ.డేవిడ్‌రాజు, పట్టణ అధ్యక్షులు బి.వేణుగోపాల సోమిరెడ్డి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ఎం.వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిఫిన్ బండ్లు అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లికి చెందిన మహేష్, శివ, శివనాగకిరణ్, ఎం.వెంకటేశ్వరరెడ్డి, సత్యనారాయణ, బి.శివపార్వతి, నాగయ్య, సింహాచలం టిఫిన్ బండ్లు, తోపుడు బండ్లు కావాలని స్థానిక వైసిపి నాయకులకు తెలిపారు. సమస్యను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దృష్టికి తీసు కెళ్లడంతో వారందరికీ టిఫిన్, తోపుడు బండ్లు అంద జేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు భాస్కరరెడ్డి, బాలాజీరెడ్డి, ఆర్.పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా మంచినీరు

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని 20వ వార్డు సీతానగరంలో స్థానికులు మంచినీటి సమస్యను ఎదుర్కొంటు న్నారు. స్థానికులు స్థానిక టిడిపి నాయకులకు సమస్యను తెలిపారు. నారా లోకేష్ సహకారంతో శుక్రవారం జలధార పేరుతో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని అందించారు.

అనంతవరంలో దీక్షలు చేస్తున్న రైతులు

ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించండి

ప్రజాశక్తి - తుళ్లూరు

రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు, జీవనోపాధికి అమరావతి రాజధాని నిర్మాణం దోహదపడుతుందని, ఇప్పటికైనా వివా దాలకు ప్రభుత్వం స్వస్తి పలికి ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని రైతులు, మహిళలు కోరారు. కోర్టు తీర్పును గౌరవించాలని, 'బిల్డ్ అమరావతి- సేవ్ ఆంధ్రప్రదేశ్' అంటూ రైతులు,మహిళలు, రైతు కూలీలు చేస్తున్న దీక్షలు శుక్ర వారంతో 1270వ రోజుకు చేరాయి. తుళ్లూరు,నెక్కల్లు, అనంతవరం, వెలగపూడి, మందడం, వెంకటపాలెం తదితర గ్రామాల్లో దీక్షలు సాగాయి. అమరావతి వెలుగు కార్య క్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించి 'జై అమరావతి' అంటూ నినాదాలు చేశారు.

నేడు 'అవతార పురుషుడు' గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి-తెనాలి

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జీవిత విశేషాలతో రూపొం దించిన 'అవతారపురుషుడు' గ్రంథావిష్కరణ శనివారం జరగ నుంది. సాయంత్రం ఐదు గంటలకు కూచిపూడిలోని పండిత గోపదేవశాస్త్రి విజ్ఞాన కేంద్రంలో గ్రంథావిష్కరణ చేయ నున్నారు. తెనాలి పట్టణానికి చెందిన ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ షేక్ అబ్దుల్ హకీంజాని ఈ పుస్తకాన్ని రాశారు. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి పుస్తక పరిచయం చేస్తారని, ముఖ్య అతిథిగా మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, విశిష్ట అతిథిగా పుస్తక ప్రచురణకర్త డాక్టర్ బాబు, ఆర్ వడ్లమూడి పాల్గొంటారని హకీంజాని తెలిపారు.

వాటర్ ప్యూరిఫైడ్ మిషన్ అందజేస్తున్న మస్తాన్‌రావు, శ్రీనివాస్

వాటర్ ప్యూరిఫైడ్ మిషన్ బహూకరణ

ప్రజాశక్తి-మంగళగిరి

స్థానిక రాజీవ్ గృహకల్ప వద్ద ఉన్న డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ (యుపిహెచ్‌సి)కు పిఇపిఎల్ అధినేత, ప్రముఖ వ్యాపారవేత్త పితాళ్ల మస్తాన్‌రావు, తన స్నేహితుడు కెవిఎన్ శ్రీనివాస్ సంయుక్తంగా వాటర్ ప్యూరిఫైడ్ మిషన్‌ను బహూకరించారు. వాటర్ ప్యూరిఫైడ్ మిషన్ ను యుపిహెచ్ ఎస్ వైద్యాధికారిణి డాక్టర్ హమీధ నీలోఫర్‌కు శుక్రవారం అందజేశారు. ఈ సంద ర్భంగా మస్తాన్‌రావు మాట్లాడుతూ, హెల్త్ సెంటర్ వైద్యుల కోరిక మేరకు రోగుల సౌకర్యార్థం దీనిని అందజేసినట్లు చెప్పారు. సమస్యను తన దష్టికి తీసుకు వచ్చి సేవా కార్యక్రమంలో తనకు అవకాశం కల్పించినందుకు స్థానిక జర్నలిస్టు మిత్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. హమీధ నీలోఫర్ మాట్లాడుతూ, వైద్యం కోసం వచ్చే రోగు లతో పాటు సేవలందించే వైద్య సిబ్బంది దాహార్తిని తీర్చేం దుకు దీనిని అందజేసిన మస్తాన్‌రావుకు కృత జ్ఞతలు తెలియ జేశారు. కార్యక్రమంలో హెల్త్ సెంటర్ సిబ్బంది అనిత, అలై ఖ్య, వందన, దుర్గా భవాని,ప్రేమ వాణి, నాగరాజు, మస్తాన్ రావు ఫ్రెండ్స్ సర్కిల్ కెవిఎన్ శ్రీనివాస్, తారక్ మహేష్, శ్రీని వాసరావు, కఠారి శ్రీను పాల్గొన్నారు..

రేపటి పల్నాడు జిల్లా స్పందన రద్దు

ప్రజాశక్తి - నరసరావుపేట

క్రోసూరు మండలంలో సోమవారం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన నేపథ్యంలో పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో స్పందన, ఎస్పి కార్యాలయం వద్ద జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్ని నిలిపివేసినట్లు శుక్రవారం జిల్లా కలెక్టరేట్, ఎస్పి కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేశారు. సమస్యల పరిష్కారానికి వచ్చే కక్షిదారులు 19 వ తేదీ జరిగే కార్యక్రమంలో తమ తమ సమస్యలు విన్నవించుకోవాలని సూచించారు.

అమిత్‌షా రాష్ట్ర పర్యటనకు వ్యతిరేకంగా రేపు నిరసనలు

సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు పాశం రామారావు, జంగాల అజయ్‌కుమార్ పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర అభివృద్ధికి నిధులు కేటాయించకుండా రాష్ట్రానికి అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వ మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తున్నట్లు సిపియం, సిపిఐ జిల్లా కార్యదర్శులు పాశం రామారావు, జంగాల అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 11న జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టుకు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించలేదని, రైల్వే జోన్ ఇవ్వలేదని, రాష్ట్రాల హక్కులు కాలరాస్తూ, కేంద్ర మంత్రి రాష్ట్రంలో పర్యటించటం సరికాదని అన్నారు. దేశంలో ప్రజల మధ్య మత కలహాలు రెచ్చగొడుతూ, ప్రజల ఐక్యతను దెబ్బతీసే విధానాలు కేంద్రం అనుసరిస్తుందని, దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుకొమ్మలుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబడుతున్నారని విమర్శించారు. ఈ విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని, ఈనెల 11న అమిత్‌షా విశాఖ పర్యటన సందర్భంగా ఎక్కడికక్కడ నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు.

18న సిఐటియు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

మీడియా సమావేశంలో వై నేతాజీ, లక్ష్మణరావు, ముత్యాలరావు, సాంబశివరావు

ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఈనెల 18న సిఐటియు ఆధ్వర్యంలో పాత గుంటూరులోని యూనియన్ జిల్లా కార్యాలయంలో ఉదయం 10 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి పిలుపునిచ్చారు. శుక్రవారం సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రక్తదాన శిబిరంలో అన్ని రంగాల కార్మికులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. శుక్రవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సిఐటియు పోరాటాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. కరోనా సందర్భంగా క్వారెంటెన్ సెంటర్ల నిర్వహణలో వాలంటీర్లుగా నిధుల సమీకరించి సహాయ కార్యక్రమాల్లో చేయడం జరిగిందన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఎటువంటి నష్టం ఉండదని, 18 సంవత్సరాల నుండి 55 సంవత్సరాలు వరకు అందరూ రక్తదానం చేయవచ్చని తెలిపారు. ఈ రక్తదాన శిబిరంకు ప్రారంభించేందుకు డీసీఎల్ ఏ.శ్రీనివాస్, డిఎంహెచ్ఓ శ్రావణ్ బాబు, లైన్స్‌క్లబ్ గవర్నర్ గోపీనాథ్ హాజరవుతారని తెలిపారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి బి ముత్యాలరావు మాట్లాడుతూ లైన్స్ క్లబ్ సహకారంతో సిఐటియు నిర్వహిస్తున్న ఈ శిబిరంలో అన్ని రంగాల కార్మికులు ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ముందస్తుగా నమోదు చేసుకునేందుకు 9490098623, 9490098625, 9490098627 నెంబర్లలో సంప్రదిం చాలన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి యం.సాంబశివరావు, కార్యదర్శి బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

ఆస్తి పన్నుపై వడ్డీ లేకుండా చెల్లించడానికి ఈ నెలాఖరు వరకే గడువు ఉన్నందున, నగరంలో ఆస్తి పన్ను బకాయిదార్లకు డిమాండ్ నోటీసులు ఇవ్వాలని, వార్డు సచివాలయాల వారీగా అసెస్మెంట్‌లకు ఇచ్చిన డిమాండ్ నోటీసులకు ఎకనాలెడ్జ్‌మెంట్‌లు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తిచేకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రెవెన్యూ అధికారులతో పన్ను వసూళ్లు, పట్టణ ప్రణాళిక అధికారులతో రోడ్ల విస్తరణ పనులపై కమిషనర్ చాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత అర్ధ సంవత్సరానికి పన్ను బకాయిలపై వచ్చే నెల నుండి వడ్డీ కలుస్తుందని, వడ్డీ విషయాన్ని బకాయిదార్లకు తెలియచేయాలని అడ్మిన్ కార్యదర్శులను ఆదేశించారు. వార్డు సచివాలయం వారీగా బకాయిదార్లకు డిమాండ్ నోటీసులు ఇవ్వాలని, మైక్, మెస్సేజ్‌ల ద్వారా కూడా పన్ను బకాయిదార్లకు సమాచారం అందించాలన్నారు. క్షేత్ర స్థాయిలో అడ్మిన్ కార్యదర్శులు పన్ను వసూళ్లలో పూర్తి స్థాయిలో విధుల్లో ఉండాలని, పన్ను వసూళ్ళపై ప్రతి రోజూ సచివాలయం వారీగా నివేదిక ఇవ్వాలన్నారు.అనంతరం పట్టణ ప్రణాళిక అధికారులతో మాట్లాడుతూ రోడ్ల విస్తరణ పనులు పూర్తి చేయాలని, పనులు జరిగిన ప్రాంతాల్లో నష్ట పరిహారం లేదా టిడిఆర్ బాండ్ల జారీకి వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు జరిగిన ప్రాంతాల్లో వెంటనే డ్రైన్ నిర్మాణ పనులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు బాలాజీ బాష, సాంబశివరావు, రవి కుమార్, రెహ్మాన్, డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఏసిపిలు బాబురావు, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

సాంకేతిక సవాళ్లను అధిగమించండి

ఘనంగా ఆర్‌విఆర్-జెసి గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

విద్యార్థులకు డిగ్రీలు ప్రధానం చేస్తున్న వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విద్యార్థులు మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా తమ ముందున్న సవాళ్ళను అధిగమించాలని భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం నాడు స్థానిక చౌడవరంలోని ఆర్.వి.ఆర్ అండ్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కళాశాల 8వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు వెంకయ్య నాయుడు ముఖ్య అతిధిగా, గౌరవ అతిథి గా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి. రాజశేఖర్ పాల్గొన్నారు. కళాశాల అధ్యక్షులు రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. కళాశాల ఆవరణ లోని రాయపాటి వెంకట రంగారావు జాగర్లమూడి చంద్రమౌళి విగ్రహాలకు వెంకయ్య నాయుడు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కళాశాల ఎన్‌సిసి విభాగ విద్యార్థుల గౌరవ వందనం ఆయన స్వీకరించారు. జ్యోతీ ప్రజ్వలన చేసి వెంకయ్య నాయుడు గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ప్రారంభించారు. వెంకయ్య నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలపై అవగాహన పెంచుకోవాలని, కమ్యూని కేషన్‌స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలన్నారు. దేశ భవిష్యత్ విద్యార్థుల మీదనే ఆధారపడి ఉందన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి. రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక రంగంలో మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నూతన ఆవిష్కరణలు చేయాలని, వచ్చిన ప్రతి - అవకాశాన్ని అందిపుచ్చుకొంటూ ముందుకు వెళ్లాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో కళాశాలలో 2019 నుంచి 23 వరకు 35వ బ్యాచ్‌కు చెందిన 1177 మంది విద్యార్థులలో డిగ్రీ పూర్తి చేసుకున్న 991 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను మరియు సివిల్, మెకానికల్, కెమికల్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, బిజినెస్ సిస్టమ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంజనీరింగ్ విభాగాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలను అతిధుల చేతుల మీదుగా అందించారు. సాంప్రదాయ దుస్తుల్లో దర్శనమిచ్చిన విద్యార్థులను వెంకయ్య నాయుడు అభినందించారు. మంత్రి కామినేని శ్రీనివాస్, కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ రాయపాటి గోపాల కృష్ణ, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీ మోహన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర కొల్లా శ్రీనివాస్, జగదీశ్ కుమార్ మద్దినేని, మాజీ గద్దె మంగయ్య, పి. గోపి చంద్, కె. రవీంద్ర, ఎన్.వి. శ్రీనివాసరావు, కళాశాల డీన్స్, వివిధ శాఖల విభాగాధిపతులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిఆర్‌డిఎ పరిధిలో ఇళ్ల నిర్మాణాలను

8 నాటికి ప్రారంభించాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

సీఆర్డీఏ పరిధిలోని పేదలందరికీ ఇళ్ళ పథకం లేఅవుట్‌లలో జూలై 8వ తేదీ నాటికి ఇళ్ళ నిర్మాణాలు ప్రారంభించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జెసి రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలసి సీఆర్డీఏ పరిధిలోని పేదలందరికీ ఇళ్ళ పథకం లేఅవుట్‌లలో ఇళ్ళ నిర్మాణాలపై గృహనిర్మాణ శాఖ, రెవెన్యూ, మున్సిపల్, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ కారణాల వలన సీఆర్డీఏ పరిధిలోని పేదలందరికీ ఇళ్ళ పథకం లేఅవుట్‌లలో లబ్ధి దారులకు ఇంటి స్థలాలు పంపిణీ ఆలస్యంగా జరిగినందున ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించిన పనులను అత్యధిక ప్రాధాన్యతతో యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. లబ్ధిదారులకు సర్వేకోడ్, ఆప్షన్ 3 ఇళ్ళకు సంబంధించి కాంట్రాక్టర్లతో ఎంవోయులు, బ్యాంక్ అకౌంట్‌లు ప్రారంభించటం, జియో ట్యాగింగ్ ప్రక్రియలను నిర్దేశించిన తేదీ నాటికి ఖచ్చితంగా పూర్తి చేయా లన్నారు. డ్వాక్రా సంఘాల్లోని లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రూ.35వేల రుణం అందించేందుకు మెప్మా, డీఆర్డీఏ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లేఅవుట్‌లలో ఇళ్ళ నిర్మాణానికి అనుగుణంగా నీటి సౌకర్యం కోసం బోర్లు ఏర్పాటు, విద్యుత్ అవసరాలకు సంబంధించి వెంటనే ప్రతిపాదనలు సిద్దంచేసి అనుమతులు తీసుకొని పనుల నిర్వహణకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సీఆర్డీఏ పరిధిలో ఇంటి స్థలాలు కేటాయించిన లబ్ధిదారులకు సంబంధించిన ప్రాంతాలైన పెదకాకాని, మంగళగిరి, తాడేపల్లి, తుళ్ళూరు తహాశీల్దార్లు, ఎంటీఎంసీ మున్సిపల్ అధికారులు హౌసింగ్ అధికారులతో సమన్వయం చేసుకొని ఇళ్ళ నిర్మాణాల పనులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ శంకరరావు, ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి, మెప్మా పీడీ వెంకట నారాయణ, తహాశీల్దార్లు రాం ప్రసాదు, ఫణీంద్రబాబు, రత్నం, నాగిరెడ్డి, విద్యుత్, ప్రజారోగ్య శాఖ ఇంజనీరింగ్, సీఆర్డీఏ అధికారులు పాల్గొన్నారు.

గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ

గర్భిణీకి పోషకాహారం పంపిణీ చేస్తున్న పద్మావతి, సిడిపిఓ తదితరులు

ప్రజాశక్తి - నరసరావుపేట

చిన్నారులకు గర్భిణీలకు పోషకాహారం అందించాలన్న సంకల్పంతో అంగన్వాడీ కేంద్రాలను నిర్వహిస్తుందని ఈ కేంద్రాలకు వస్తున్న ఇంటి వద్ద నుండి టి హెచ్ఆర్ తీసుకుంటున్న పిల్లల ఆరోగ్య పరిస్థితి పై ప్రతినెల సర్వే జరుగుతుందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి పద్మావతి చెప్పారు. పల్నాడు జిల్లా నరసరావుపేట ప్రాజెక్టు పరిధిలోని చంద్రబాబు నాయుడు కాలనీ1, 2 ఎస్ఎన్‌పురం అంగ న్వాడి కేంద్రాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అంగన్వాడీ కేంద్రాలకు ఇస్తున్న పౌష్టికాహారం సక్రమంగా గర్భిణీలకు బాలింతలకు చిన్నారులకు అందుతున్నాయా మెనూ ప్రకారం స్పాట్ ఫీడింగ్ ఇస్తున్నారా అని తల్లులను అడిగి తెలుసుకున్నారు.వేసవికాలం దష్ట్యా ఎండ తీవ్రతను దష్టిలో పెట్టుకొని గర్భిణీలు, చిన్నారులకు ఆరోగ్యపరంగా పలు సలహాలు సూచనలు చేశారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా వైఎస్ఆర్ సంపూర్ణ 6 రకాల పోషకాహార పదార్థాలు రాగి పిండి, బెల్లం, అటుకులు, చిట్టీలు, జొన్న పిండి, ఖర్జూరాలు అందరికీ అందటం పట్ల ఆమె సంతప్తి వ్యక్తం చేశారు. బాలింతలకు, గర్భిణులకు వైయస్సార్ సంపూర్ణ పోషకాహార పదార్థాలను పంపిణీ చేశారు. అంగన్వాడి కేంద్రంలోని హాజరు పట్టిక ప్రీస్కూలు బోధనా పద్ధతులు, ఎత్తు బరువుల రిజిస్టర్లను టిహెచ్ఆర్ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అంగన్వాడి కేంద్రాలలో ఉన్న పౌష్టికాహారంలను పరిశీలించి తల్లులకు రక్తహీనత నివారించుటకు కొరకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఫోర్ట్ ఫ్రైడ్ రైస్ ను వినియోగించుకోవాలన్నారు. ఆకుకూరలు ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా తీసుకోవాలి అని తల్లులకు సూచించారు. అంగన్వాడి కేంద్రాలపై పూర్తిస్థాయిలో నిఘా ఉంటుందని ఎక్కడ లోటుపాట్లు లేకుండా చూసేందుకు ఏర్పాటు చేశామన్నారు. సిడిపిఓలు, సూపర్వైజర్ల నివేదికలతో పాటు స్వయంగా తనిఖీలు జరుగుతున్నాయని ఎక్కడైనా సమస్యలు కనిపిస్తే నేరుగా కమిషన్‌కు ఫిర్యాదు చేయొచ్చన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బాల్య వివాహాల నిరోధకానికి రెవెన్యూ, పంచాయతీ, మహిళా పోలీసులు సచివాలయం కార్యదర్శులు వాలంటరీల భాగస్వామ్యంతో బాల్య వివాహాలను నియంత్రించడం జరుగుతుం దన్నారు. గుడ్ టచ్ బాడ్ టచ్ అంశాలపై బాలికలకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ అవగాహన కల్పిస్తుందన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు బాల కార్మికులను గుర్తించి వారిని బడిలోకి పంపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుం దన్నారు. కార్యక్రమంలో పిడి అరుణ సిడిపిఓ ఉమామహేశ్వరి, సూపర్వైజర్ గౌస్య అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.